ప్రజాశక్తి
శుక్రవారం 17 నవంబర్ 2023
8 పేజీలు
విశాఖపట్నం అనకాపల్లి





బల్క్ డ్రగ్ పనులకు ఎపిఐఐసి కసరత్తు

◆ నిధుల్లేక పిపిపి వైపు మొగ్గు ◆ త్వరలో ఈ - టెండర్లు ఆహ్వానం



ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

జిల్లాలోని నక్కపల్లిలో బల్క్ డ్రగ్ పార్కు పనులు మరో రెండు నెలల్లో ప్రారంభం కానున్నాయి. ఈ క్రమంలో పరిశ్రమల రాకకు ప్రాథమిక అవసరమైన కామన్ ఎఫ్లూయింట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ (సిఇటిపి) పనులకు ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక మౌలిక సదుపాయాల కల్పన సంస్థ (ఎపిఐఐసి) టెండర్లు పిలవనుంది. ఎపిఐఐసి వద్ద నిధుల్లేకపోవడంతో పబ్లిక్ ప్రయివేట్ పార్టనర్‌షిప్ (పిపిపి) పద్ధతిలో సిఇటిపి, వాటర్ ట్రీట్‌మెంట్, ఇతర పనులు చేపట్టాలని భావిస్తోంది. దాదాపు రూ.500 కోట్లు విలువైన ఈ పనులకు అనుభవం కలిగిన ప్రయివేటు సంస్థలను ఈ - టెండర్ల ద్వారా ఆహ్వానించనుంది. కేంద్ర ప్రభుత్వం నుంచి కొన్ని అనుమతులు రాబెట్టుకొని టెండర్ల ప్రక్రియకు వెళ్లడానికి సిద్ధపడుతోంది. కాకినాడ సెజ్ నుంచి బల్క్ డ్రగ్ పార్కును నక్కపల్లికి తరలిస్తూ సెప్టెంబర్ 20న రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించినప్పటికీ కేంద్ర ప్రభుత్వం నుంచి అనుమతులు రావాల్సివుంది. అందుకు సంబంధించిన ప్రతిపాదనలను కేంద్ర ప్రభుత్వానికి వారం రోజుల్లో పంపించనున్నారు. ఈ అను మతులతో పాటు పర్యావరణ అనుమతులను కూడా కేంద్ర ప్రభుత్వం ఇవ్వాల్సివుంది. అవి వచ్చాక ఈ టెండర్లకు వెళ్లాలని యోచిస్తున్నారు.

టెండర్లు దక్కించుకున్న సంస్థ కేవలం పరిశ్రమల నుంచి నిర్వహణ ఖర్చులు తీసుకొనేలా ఎపిఐఐసి ఒప్పందం చేసుకోనుంది. గతంలో వలె ప్రయివేటు డెవలపర్‌కు ప్రభుత్వ ఆస్తులపై హక్కు దఖలుపర్చకుండా కేవలం పరిశ్రమలకు కల్పించిన సదుపాయాలకు రుసుము వసూలు చేసుకొనేందుకు ప్రయివేటు సంస్థను పరిమితం చేయనుంది. నూతన నిబంధనల ప్రకారం ప్రభుత్వ ఆస్తులపై పూర్తి హక్కు ప్రభుత్వానికి వుండనుంది. రెండు వేల ఎకరాల్లో ఏర్పాటుకానున్న బల్క్ డ్రగ్ పార్కులో పరిశ్రమలకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించనున్నారు. కాలుష్య ప్రభావం పెద్దగా లేకుండా వ్యర్థ రసాయనాలను శుద్ధి చేసే సిఇటిపిని ఆధునిక టెక్నాలజీతో నిర్మించనున్నట్లు ఎపిఐఐసి అధికారులు 'ప్రజాశక్తి'కి తెలిపారు.

'ఉక్కు'పై నాటకాలొద్దు

◆ బిజెపి ఎంపీ జివిఎల్ కపట ప్రకటనలు ఆపి కేంద్రంతో ప్రకటన చేయించాలి
◆ సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి జగ్గునాయుడు డిమాండ్

ప్రజాశక్తి - కలెక్టరేట్ : విశాఖ ఉక్కు కర్మాగారం విషయంలో బిజెపి రాజ్యసభ సభ్యులు జివిఎల్.నరసింహారావు కపట ప్రకటనలు ఆపి, స్టీల్‌ప్లాంట్ అమ్మకాన్ని నిలిపివేస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వంతో ప్రకటన చేయించాలని సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. స్టీల్‌ప్లాంట్ అమ్మే ప్రక్రియను నిలిపివేసినట్టు, భవిష్యత్తులో కూడా ప్రైవేటీకరణ జరగకుండా కేంద్ర ప్రభుత్వం ప్లాంట్‌ను లాభాల బాట పట్టించేందుకు కృషి చేస్తున్నట్టు, స్ట్రాటజిక్ సేల్ కోసం ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంట్రెస్ట్‌కు వెళ్లదని పేర్కొంటూ తరచూ జివిఎల్ ప్రకటనలు చేస్తున్నారన్నారని తెలిపారు. ఆయన ప్రకటనలు వాస్తవమైతే, చిత్తశుద్ధి ఉంటే ఆ విషయాలను కేంద్ర మంత్రివర్గం ద్వారా ప్రకటన చేయించాలన్నారు. అప్పుడే కార్మికులు, ప్రజలు నమ్ముతారన్నారు. ప్లాంట్‌ను లాభాల బాట పట్టించడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు ఆయన ప్రకటించారని, అదే వాస్తవమైతే ప్లాంటును పూర్తిస్థాయి సామర్థ్యంతో ఎందుకు నడిపించడం లేదని, ఉత్పత్తిని నిలిపివేసిన బ్లాస్ట్ ఫర్నేసులను తిరిగి ప్రారంభించడం లేదని ప్రశ్నించారు. ఎందుకు సొంత గనులు, వర్కింగ్ క్యాపిటల్ ఇవ్వడం లేదని, ఎందుకు ఖాళీగా ఉన్న ఐదు వేల పోస్టులను భర్తీ చేయడంలేదని జగ్గునాయుడు సూటి ప్రశ్న వేశారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని నాగర్‌నార్ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించేది లేదని స్వయానా కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా ఆ రాష్ట్రం వెళ్లి మరీ ప్రకటించిన విషయాన్ని గుర్తుచేశారు. వైజాగ్ స్టీల్ ప్లాంట్ విషయంలో కేంద్ర బిజెపి పాలకులకు ఎందుకు ఆ విధంగా నోరు రావడం లేదన్నారు. ఎందుకు జిందాల్ సంస్థను విశాఖ స్టీల్ ప్లాంట్‌లో జొప్పించే కుట్రలు చేస్తున్నారని నిలదీశారు. మోసపూరిత ప్రకటనలను కార్మికులు, ప్రజలు నమ్మరన్న విషయాన్ని జివిఎల్ గుర్తెరగాలన్నారు. ఉక్కు ఉద్యమాన్ని ఉధృతం చేసే దిశగా, ప్రజా ఉద్యమంగా మలిచే దిశగా సిపిఎం కృషి చేస్తోందన్నారు. రాబోయే ఎన్నికలలో స్టీల్ ప్లాంట్ పరిరక్షణ రాజకీయ అజెండాగా మారనుందని తెలిపారు.

సిఐటియు ఖండన

జివిఎల్ ప్రకటనలను సిఐటియు విశాఖ జిల్లా కమిటీ ఖండించింది. ఈ మేరకు సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కెఎం.శ్రీనివాసరావు, ఆర్‌కెఎస్‌వి.కుమార్, కోశాధికారి ఎస్.జ్యోతీశ్వరరావు ఓ ప్రకటన విడుదల చేశారు.

నగరంలో 20 మంది ఎస్ఐలు బదిలీ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖ సిటీ పోలీస్ కమిషనరేట్ పరిధిలో పలు పోలీస్ స్టేషన్లలో పనిచేస్తున్న 20 మంది ఎస్ఐలను బదిలీ చేస్తూ నగర పోలీస్ కమిషనర్ ఎ.రవిశంకర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయిన వారిలో సిటీ స్పెషల్ బ్రాంచ్‌కు చెందిన నలుగురు, సిటీ విఆర్, పలు పోలీస్ స్టేషన్లకు అటాచ్ చేసిన ఆరుగురు, స్టీల్ ప్లాంట్ పోలీస్ స్టేషన్‌కు చెందిన ఇద్దరు, టూ టౌన్‌కు చెందిన ఇద్దరు, త్రీ టౌన్ నుంచి ఇద్దరు పద్మనాభం, వన్ టౌన్, సిసిఆర్‌బి, పెందుర్తి నుంచి మిగతా 2లో..

రాష్ట్రమంతటా పోటీ : కెఎ.పాల్

▶ వార్త మెయిన్‌లో..

నేటి నుంచి టి - 20 ఆఫ్‌లైన్ టికెట్ల విక్రయాలు

▶ వార్త 3లో..

మెట్రో రైలు ప్రాజెక్టుల్లో సవాళ్లు

▶ వార్త 3లో..



అనకాపల్లిలో శంకరయ్య చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న లోకనాథం, తదితరులు

శంకరయ్యకు సిపిఎం ఘన నివాళి

విశాఖ, అనకాపల్లిల్లో సంతాప సభలు వార్త 5లో..



జెడ్‌పి వైస్ ఛైర్మన్‌గా గిరిబాబు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఉమ్మడి విశాఖపట్నం జిల్లా పరిషత్ వైస్ ఛైర్మన్‌గా సుంకర గిరిబాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురువారం ఈ పదవికి ఎన్నిక జరగ్గా ఆయన ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారిగా వ్యవహరించిన జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున ప్రకటించారు. జిల్లా పరిషత్‌కు ఇద్దరు వైస్ ఛైర్మన్లు ఉండగా వారిలో ఒకరైన దాసరి అప్పారావు (సబ్బవరం జెడ్‌పిటిసి) ఇటీవల మరణించడంతో ఏర్పడిన ఖాళీలో ఈ ఎన్నిక నిర్వహించారు. కొద్ది మిగతా 2లో..

సముద్ర నీటి కాలుష్య నియంత్రణకు చర్యలు

విశాఖ జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మల్లికార్జున

ప్రజాశక్తి - కలెక్టరేట్, ఎంవిపి.కాలనీ : సముద్రంలోకి ప్రవహించే వ్యర్థాలు, మురుగునీటితో సముద్ర జలాలు కలుషితం కాకుండా ఉండేందుకు తగు నివారణ చర్యలను వేగవంతం చేయాలని, వీటిపై వీలైనంత త్వరగా నివేదిక తమకు అందజేయాలని జిల్లా కలెక్టర్, విఎంఆర్‌డిఎ కమిషనర్ డాక్టర్ ఎ.మల్లికార్జున కోరారు. విశాఖపట్నం ఏరియాలో సముద్రంలోకి ప్రవహించే వ్యర్థాలు, మురుగునీటితో సముద్రపు నీరు కలుషితమైందని డాక్టర్ రాజేంద్రసింగ్, బొలిశెట్టి సత్యనారాయణ 2020లో హైకోర్టులో కేసు వేసిన సంగతి విదితమే. ఈ విషయమై హైకోర్టు ఆదేశాల మేరకు గురువారం జిల్లా కలెక్టర్ ఛాంబరులో సముద్ర జలాలు కలుషితం కాకుండా ఉండేందుకుగల నివారణ చర్యలపై కమిటీ సమావేశం జరిగింది. కొత్త ఎస్‌టిపిలు, ఇటిపిలను నిర్మించడం ద్వారా లేదా ఇప్పటికే ఉన్న వాటి సామర్థ్యాన్ని పెంచడం ద్వారా తీసుకోవలసిన చర్యలపై కలెక్టర్ సభ్యులకు పలు సూచనలు చేశారు. సమావేశంలో కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి శాస్త్రవేత్త డి.సౌమ్య, కాలుష్య నియంత్రణ మండలి ఎన్విరాన్ మెంటల్ అధికారులు పాల్గొన్నారు.

మొదటి పేజీ తరువాయి..



గిరిబాబును అభినందిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి తదితరులు

జెడ్‌పి వైస్ ఛైర్మన్‌గా గిరిబాబు

రోజుల క్రితం ఎన్నికల కమిషనర్ నీలం సాహ్ని నోటిఫికేషన్ జారీ చేశారు. ఈ క్రమంలో ఎన్నిక కోసం గురువారం జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ హాల్‌లో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. వైసిపికి చెందిన 25 మంది జెడ్‌పిటిసి సభ్యులు హాజరయ్యారు. జెడ్‌పి ఛైర్‌పర్సన్, ముంచింగిపుట్టు జెడ్‌పిటిసి సభ్యురాలు జె.సుభద్ర జెడ్‌పి వైస్ ఛైర్మన్ పదవికి పద్మనాభం జెడ్‌పిటిసి సభ్యుడు సుంకర గిరిబాబు పేరును ప్రతిపాదించగా పరవాడ జెడ్‌పిటిసి సభ్యుడు పైలా సన్యాసిరాజు బలపరిచారు. మరో పేరు ప్రతిపాదనకు రాకపోవడంతో గిరిబాబు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రిసైడింగ్ అధికారి మల్లికార్జున ప్రకటించారు.

పలువురు అభినందనలు

గిరిబాబుకు జెడ్‌పి ఛైర్‌పర్సన్ జె.సుభద్ర, భీమిలి ఎమ్మెల్యే, మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావుతో పాటు పలువురు జెడ్‌పిటిసిలు, నాయకులు అభినందనలు తెలిపారు.

నగరంలో 20 మంది ఎస్‌ఐలు బదిలీ

ఒక్కొక్కరు ట్రాఫిక్, క్రైమ్, లా అండ్ ఆర్డర్ విభాగాలలో పనిచేస్తున్న సబ్ ఇన్‌స్పెక్టర్లు ఉన్నారు. ఈ ఉత్తర్వులు వెంటనే అమల్లోకి వస్తాయని, రానున్న సంవత్సరం సాధారణ ఎన్నికలతో పాటు పలు అంతర్జాతీయ కార్యక్రమాలను నగరంలో నిర్వహించనున్నందున, పనితీరు, ప్రతిభ ఆధారంగా ఈ సాధారణ బదిలీలు నిర్వహించినట్లు నగర పోలీస్ కమిషనర్ రవిశంకర్ తెలిపారు. ఇదిలా ఉండగా గత శుక్రవారం సిటీ పోలీస్ కమిషనరేట్ పరిధిలో 36 మంది ఎస్‌ఐలను బదిలీ చేసిన విషయం తెలిసిందే.



మాట్లాడుతున్న ధనలక్ష్మి

ఘనంగా కళంజియ దినోత్సవం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : సాగరతీర కళంజియ సమాఖ్య 26వ కళంజియ ఉద్యమ దినోత్సవ వేడుకలు గురువారం ప్రారంభమయ్యాయి. ఈ సంబరాలు ఈ నెల 30 వరకూ జరుగనున్నాయి. గురువారం చిన వాల్తేర్ రజకవీధి, తమిళ్ స్ట్రీట్ క్లస్టర్లలో ఈ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా సాగరతీర కళంజియ సమాఖ్య కోస్టల్ రీజనల్ కో - ఆర్డినేటర్ ధనలక్ష్మి మాట్లాడారు. కళంజియ దినోత్సవ ప్రాధాన్యతను వివరించారు. అతిథులుగా వార్డు కార్పొరేటర్ మువ్వల లక్ష్మీ సురేష్, 20వ వార్డు సిఐ రత్నం, 21వ వార్డు సిఐ ఇందిర, గ్రామపెద్దలు శ్రీనివాస్ రావు, మురళీ పాపారావు, రాజు, తిలక్, సాగర తీర కళంజియ సమాఖ్య కో - ఆర్డినేటర్ సాయికృష్ణ, క్లస్టర్ కార్యవర్గం పద్మ, హైమ, గౌరీ, సునీత, శశికళ, సునీత, రాజి, సీతారత్నం పాల్గొన్నారు.



పోటీల ప్రారంభ వేడుకలో ఎస్‌బిఐ అధికారులు

ఎస్‌బిఐ ఇంటర్ సర్కిల్ వాలీబాల్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా - అమరావతి సర్కిల్ వెల్ఫేర్ కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇంటర్ సర్కిల్ వాలీబాల్ పోటీలు గురువారం ఎయు ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. 16 సర్కిళ్ల పరిధిలో 16 నుంచి 19వ తేదీ వరకు జరుగనున్న ఈ పోటీల్లో పలువురు క్రీడాకారులు పాల్గొని తమ సత్తా చాటారు. తొలి రోజు స్థానిక ఎల్‌డిఎం, ఇతర ఉన్నతాధికారుల సమక్షంలో క్రీడలు ప్రారంభమయ్యాయి.

స్విమ్మింగ్ పూల్ ప్రైవేటుపరంపై నిరసన

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఆర్‌కె.బీచ్‌లోని జివిఎంసి ఆక్వా స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఉన్న స్విమ్మింగ్ పూల్ నిర్వహణ బాధ్యతను ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టేందుకు జివిఎంసి స్టాండింగ్ కమిటీ తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ సిపిఎం మద్దిలపాలెం జోన్ కమిటీ ఆధ్వర్యాన సంబంధిత స్విమ్మింగ్ పూల్ వద్ద గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం ఫ్లోర్ లీడర్ డాక్టర్ బి.గంగారావు మాట్లాడుతూ జివిఎంసి ఆధీనంలో ఉన్న స్విమ్మింగ్ పూల్‌ను ప్రైవేట్ వ్యక్తులకు ఇవ్వడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. తక్షణమే ప్రజల ఆస్తులను ప్రైవేట్ వ్యక్తులకు ఇచ్చే నిర్ణయాన్ని నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. స్టాండింగ్ కమిటీలో ప్రజా వ్యతిరేక నిర్ణయాలు చేసి కౌన్సిల్‌ను అవమానపరుస్తున్నారని దుయ్యబట్టారు. ఇప్పటికే ఎంవిపిలో రూ.25 కోట్ల ప్రజాధనంతో అధునాతనమైన స్పోర్ట్స్ ఎరీనాను నిర్మించి వైసిపి అనుయాయులకు కట్టబెట్టడంతో ప్రయివేటుగా ఎంతెంత వసూలు చేస్తున్నారో తెలిపారు. విచ్చలవిడిగా డబ్బులు దోచుకొనే అవకాశం ప్రయివేటు సంస్థకు కల్పించడం దారుణమన్నారు. బీచ్‌లో ఉన్న స్విమ్మింగ్ పూల్‌ను ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెడితే సామాన్య, మధ్యతరగతి ప్రజలు వినియోగించుకోలేని పరిస్థితి దాపురిస్తుందన్నారు. 285 ఎకరాల ముడసర్లోవ పార్కును, ఇందిరా ప్రియదర్శిని స్టేడియంను, 16 ఎకరాల శివాజీ పార్కును, గాజువాక, మధురవాడల్లో ఉండే పార్కులు, స్టేడియాలను సైతం జివిఎంసిలోని వైసిపి పాలకవర్గం ప్రైవేట్ వ్యక్తులకు ధారాదత్తం చేయడానికి పూనుకోవడంపై ఆందోళన వ్యక్తం చేశారు. ఆ చర్యలను ఆపకుంటే కార్పొరేషన్‌ను స్తంభింపజేస్తామని హెచ్చరించారు.



నిరసన తెలుపుతున్న గంగారావు, సిపిఎం నాయకులు

నిరసనకు ముందు రూ.3 కోట్ల ప్రజాధనంతో ఆధునికీకరణ పనులు చేయించిన స్విమ్మింగ్ పూల్‌ను గంగారావు, పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్‌కెఎస్‌వి.కుమార్, జోన్ కార్యదర్శి వి.కృష్ణారావు పరిశీలించారు. వారి వెంట నాయకులు పి.వెంకటరావు, కె.కుమారి, పీతల అప్పారావు, జివి.రమణ, అనపర్తి అప్పారావు, త్రినాధరావు, జి.అప్పలరాజు, కె.నర్సింగరావు ఉన్నారు.

తొలగించిన ఓట్లను పునరుద్ధరించాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఓటర్ల జాబితా నుంచి తన పేరును, తన తల్లిదండ్రుల పేర్లను గల్లంతు చేశారని, వాటిని జాబితాలో తక్షణం పునరుద్ధరించాలని తెలుగు శక్తి అధ్యక్షులు బివి.రామ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం కలెక్టర్‌కు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. అనంతరం రామ్ మీడియాతో మాట్లాడుతూ తమ ఓట్ల తొలగింపు నకు కారణమైన వారిపై చర్యలు తీసుకోవా లన్నారు. విశాఖ తూర్పు నియోజకవర్గం పరిధి వెంకోజీపా లెంలో 12 సంవత్సరాల నుంచి తాము నివాసం ఉంటున్నట్లు తెలిపారు. గత ఎన్నికలలో పోలింగ్ బూత్ నెంబర్ 273లో ఓటు వేసామన్నారు. తమ నియోజకవర్గంలో తమ కుటుంబంతో పాటు సుమారు 40 వేల మంది ఓట్లు గల్లంతయ్యాయన్నారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో డాక్టర్ పప్పూరు నికుంజ్, మల్ల రవి తదితరులు ఉన్నారు.



కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న రామ్

కలిసి పనిచేస్తే విజయం తథ్యం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి టిడిపి, జనసేన కూటమి ఎన్నికల్లో విజయం సాధించడం అత్యంత ముఖ్యమని మాజీ ఎమ్మెల్యే, టిడిపి దక్షిణ ఇంచార్జ్ గండి బాబ్జీ అన్నారు. గురువారం జిల్లా పరిషత్ దరి ఓ ఫంక్షన్ హాలులో దక్షిణ నియోజకవర్గం జనసేన, టిడిపి నాయకుల సంయుక్త సమావేశం జరిగింది. బాబ్జీతో పాటు జనసేన పిఎసి సభ్యులు కోన తాతారావు మాట్లాడారు. కలిసి పనిచేస్తే రానున్న ఎన్నికల్లో విజయం తథ్యమని అన్నారు.

సహకార సంఘాల వారోత్సవం

ప్రజాశక్తి-పెదబయలు: స్థానిక ప్రాథమిక సహకార సంఘ భవనంలో 70వ అఖిల భారత సహకార సంఘాల వారోత్సవాలను నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా సంఘ కార్యదర్శి రాంబాబు ఆధ్వర్యంలో సంఘం జెండాను స్థానిక ఎంపిపి బోండా వరహాలమ్మ ఆవిష్కరించారు. ఈనెల 14 నుండి 20 వరకు జరిగే సహకార సంఘాల వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

పెరిగిన చలి తీవ్రత

సీలేరు : ఏజెన్సీలో చలి తీవ్రత పెరిగింది. సాయంత్రం ఆరు గంటల నుంచి మంచు కురుస్తుండడంతో స్వల్పంగా శీతల గాలులు వీస్తూ చలి మెల్ల మెల్లగా పెరుగుతూ రాత్రి 9 తర్వాత చలి అధికమవుతుంది. ప్రతిరోజు ఉదయం 4 గంటల నుంచి మంచు అధికంగా కురుస్తూ తెరచాపలా కమ్మేస్తుంది. దీంతో ఉదయం వ్యాయామం చేసేవారికి ఇబ్బందికరంగా మారింది. డిసెంబర్ నెలలో మరింత చలి తీవ్రత అధికంగా ఉంటుందని పలువురు భావిస్తున్నారు. సీలేరు నది పరివాహక ప్రాంతంలో చింతపల్లి క్యాంపు లైకెన్‌ఫూర్, చంద్రవల్లి గ్రామ గిరిజనులు చలిమంటలు వేసుకుంటూ ఉప శమనం పొందు తున్నారు.

పీజీ వైద్యులకు వర్క్‌షాప్

ప్రజాశక్తి- తగరపువలస : స్థానిక సంగివలస అనిల్ నీరుకొండ ఆసుపత్రికి అనుసంధానమైన ఎన్ఆర్ఐ మెడికల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ కళాశాలలో మొదటి ఏడాదిలో ప్రవేశం పొందిన పోస్ట్ గ్రాడ్యుయేట్ వైద్యులకు పలు అంశాలపై రెండురోజుల పాటు నిర్వహించిన వర్క్ షాప్ గురువారంతో ముగిసింది. శస్త్ర అనే విద్యా విభాగం ద్వారా 'బేసిక్ సర్జికల్ స్కిల్ 'పై వర్క్ షాప్ నిర్వహించారు. శస్త్ర చికిత్స అనంతరం కుట్లువేసే విభిన్న పద్ధతులను ప్రయోగాత్మకంగా అవగాహన కల్పించారు. పలు నమూనాలను ప్రదర్శించారు. ఆసుపత్రి డీన్ డాక్టర్ పివి.సుధాకర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ కె.రంజిత్ మనోహర్, డాక్టర్ బిఎస్‌వి.సత్యకుమార్ ఆధ్వర్యాన జరిగిన వర్క్ షాప్‌లో వృత్తిపరమైన మెలకువలు నేర్పారు. ఈ తరహా వర్క్‌షాప్‌లు వృత్తిలో మరింత నైపుణ్యం పెంచుకునేందుకు ఉపయోగ పడతాయని డీన్ డాక్టర్ సుధాకర్ తెలిపారు. సుమారు 200 మంది పీజీ వైద్యులు పాల్గొన్నారు.

హిందీ సర్టిఫికెట్లు అందజేత

ప్రజాశక్తి -తగరపువలస : భీమిలి మండలం తాటితూరు జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు దక్షిణ భారత హిందీ ప్రచార సభ ద్వారా ప్రాథమిక నుంచి ప్రవీణ వరకు సెప్టెంబర్‌లో జరిగిన పరీక్షల్లో ఉత్తీర్ణులైన వారికి గురువారం పాఠశాలలో సర్టిఫికెట్లు అందజేశారు. ఇంఛార్జి హెచ్ఎం మురళీధర్, ఇతర ఉపాధ్యాయులు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. జాతీయ భాష హిందీ అభివృద్ధికి హిందీ ఉపాధ్యాయులు టిఎస్‌వి.ప్రసాదరావు చేస్తున్న కృషిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వి.శ్రీనివాసరావు, జె.అప్పలనాయుడు, టిఎ.సూర్యనారాయణ, తారకేశ్వరరావు, ప్రభావతి పాల్గొన్నారు.

ఇఒను కలిసిన బీసీ సంఘం నాయకులు

ప్రజాశక్తి-సింహాచలం: సింహాచల దేవస్థానం ఇఒగా బాధ్యతలు చేపట్టిన సింగాల శ్రీనివాసమూర్తిని గురువారం ఏపీ బీసీ రాష్ట్ర యాదవ మహాసభ అధ్యక్షులు నమ్మి అప్పలరాజు, జాతీయ బీసీ సంఘం రాష్ట్ర కార్యదర్శి కిలాడి అప్పలరాజు, ఏపీ యాదవ ఉద్యోగ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కోన బాబుయాదవ్, భీమిలి యాదవ నాయకులు నడగల రమేష్ తదితరులు కలిసి సన్మానించారు. బీసీ వర్గానికి చెందిన వ్యక్తి ఇఒగా రావటం ఆనందంగా ఉందన్నారు. సింహాద్రి అప్పన్న ఆశీస్సులతో మంచి పేరు ప్రఖ్యాతలు సంపాదించాలని ఆకాంక్షించారు.

రామాయణంపై క్విజ్

ప్రజాశక్తి-సీతమ్మధార : పబ్లిక్ లైబ్రరీ సౌజన్యంతో విశాఖసాహితి, అఖిలభారతీయ సాహిత్య పరిషత్తు ఆధ్వర్యాన డాక్టర్ డివి సూర్యారావు నిర్వహణలో గురువారం రామాయణంపై క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలో 11 టీములు పాల్గొన్నాయి. ఈ సందర్భంగా విశాఖసాహితి ఉపాధ్యక్షులు డాక్టర్ కందాళ కనకమహాలక్ష్మి మాట్లాడుతూ, ఇటువంటి పోటీలతో యువతలో రామాయణ, మహాభారత గ్రంథాలపై అవగాహన కలుగుతుందన్నారు. అఖిల భారతీయ సాహిత్య పరిషత్తు కార్యదర్శి శేఖరమంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ, గ్రంథాలయాలు జ్ఞాన కాంతిని పంచేవన్నారు. పబ్లిక్ లైబ్రరీ సంయుక్త కార్యదర్శి, క్విజ్ మాస్టారు డాక్టర్ డివి.సూర్యారావు మాట్లాడుతూ, యువత సాహిత్యంలో ఆసక్తి చూపి భాషకు మేలు చెయ్యాలన్నారు. విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో పౌర గ్రంథాలయ గ్రంథపాలకులు దుర్గారాణి పాల్గొన్నారు.

భారత్ - ఆస్ట్రేలియా టి-20 మ్యాచ్‌కు..

నేటి నుంచి ఆఫ్‌లైన్ టికెట్ల విక్రయాలు



క్యూలైన్ల ఏర్పాట్లను పరిశీలిస్తున్న పోలీసులు

పజాశక్తి -పిఎం పాలెం : విశాఖ వేదికగా ఈ నెల 23 తేదీన జరగనున్న భారత్- ఆస్ట్రేలియా టి-20 మ్యాచ్‌కు ఆఫ్ లైన్ టికెట్ల అమ్మకాలు శుక్రవారం ప్రారంభంకానున్నాయి. వైఎస్ఆర్ ఎసిఎ, విడిసిఎకు సంబంధించి బి గ్రౌండ్ వద్ద ఏర్పాట్లు పూర్తిచేశారు. ఇప్పటికే ఆన్‌లైన్‌లో విక్రయాలు పూర్తవడంతో ఆఫ్‌లైన్ కౌంటర్ల వద్ద పెద్ద ఎత్తున డిమాండ్ పెరగనుంది. 17, 18 తేదీల్లో బి గ్రౌండ్, ఇందిరా ప్రియదర్శిని మునిసిపల్ స్టేడియం, గాజువాక రాజీవ్‌గాంధీ ఇండోర్ స్టేడియంలలో ఉదయం 11 గంటల నుంచి ఆఫ్‌లైన్ టికెట్లు విక్రయిస్తారని ఎసిఎ కార్యదర్శి ఎస్ఆర్.గోపీనాథరెడ్డి తెలిపారు. రూ.600, రూ.1500, రూ.2,000, రూ.3,000, రూ.3,500, రూ.6,000 ధరల్లో టికెట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఆఫ్ లైన్ ప్రక్రియలో 11,500 టిక్కెట్ల విక్రయాలు జరపనున్నట్లు వివరించారు.

వరి పంటను పరిశీలించిన ఎంపిపి

ప్రజాశక్తి -తగరపువలస : భీమిలి మండలంలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో దాకమర్రిలో ఎండిన వరి పంటను ఎంపిపి దంతులూరి వెంకట శివ సూర్య నారాయణ రాజు, సర్పంచ్ చెల్లూరి పైడప్పడు, ఎంపిటిసి సభ్యులు నగేష్ బాబు, వైసిపి మండల అధ్యక్షులు గాడు శ్రీను గురువారం పరిశీలించారు. 'అప్పుచేసి పంటపై పెట్టుబడి పెట్టాం. వర్షాలు పడక పోవడంతో వరి పంట ఎండిపోయింది' అంటూ పలువురు రైతులు ఆవేదన వెలిబుచ్చారు. తమను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఇందుకు ఎంపిపి, సర్పంచ్ స్పందిస్తూ నష్ట పోయిన రైతులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకుంటుందని హామీ ఇచ్చారు. ఇప్పటికే డివిజన్ పరిధిలో ఎండిన వరి పంట నష్టాన్ని, రైతుల కష్టాన్ని భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారని ఎంపిపి రైతులకు తెలిపారు.



దాకమర్రిలో ఎండిన వరి పంటను పరిశీలిస్తున్న ఎంపిపి వాసురాజు

'విజయశ్రీ'లో ఉచిత వైద్యశిబిరం



శిబిరంలో మాట్లాడుతున్న డాక్టర్ వేణుమాధవి

ప్రజాశక్తి -మధురవాడ : వైజాగ్ కన్వెన్షన్ ఎదురుగా గల విజయశ్రీ హాస్పిటల్ ఆధ్వర్యాన గురువారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఎముకలు దృఢత్వాన్ని తెలియచేసే పరీక్షలను శిబిరంలో ఉచితంగా చేశారు. ఈ సందర్భంగా ఎండోక్రైనాలజీ వైద్య నిపుణులు డాక్టర్ పి.వేణుమాధవి మాట్లాడుతూ, ఎముకలు దృఢత్వ పరీక్షలు చేయించుకొని ముందుగా జాగ్రత్త పడటం వల్ల వృద్ధాప్యంతో ఎముకలు విరగకుండా నివారించవచ్చని తెలిపారు. ఎముకలు దృఢంగా ఉండటానికి పాలు, కాల్షియం ఉన్న ఇతర ఆహారపదార్థాలు తీసుకోవాలని సూచించారు. క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలన్నారు.

సహకార సంఘాలను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి -ఆనందపురం: సహకార సంఘాల సేవలను సద్వినియోగం చేసుకొని రైతులు అభివృద్ధి చెందాలని మూడు జిల్లాల ఎడ్యుకేషన్ కో-ఆర్డినేటర్ సోమేశ్వరరావు సూచించారు. ఆనందపురం సహకార సంఘం అధ్యక్షులు పాండ్రంకి అప్పారావు ఆధ్వర్యాన గురువారం సహకార వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సహకార సంఘాల ద్వారా రైతులకు రుణాలు, బీమా తదితర సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ వారోత్సవాల్లో రైతులను భాగస్వాములు చేసి బ్యాంకు విధివిధానాలను తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో ముందుగా కార్యాలయం ఎదుట జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో ఆనందపుర సహకార సంఘం అధ్యక్షులు పాండ్రంకి అప్పారావు, డిసిసిబి సూపర్‌వైజర్ వేణు, సిఇఒ పంచముకేశ్వరరావు, సిబ్బంది ఎస్.నారాయణరావు, డ్వాక్రా సంఘ సభ్యులు, సహకార సంఘ సభ్యులు పాల్గొన్నారు

మెట్రో రైలు ప్రాజెక్టుల్లో సవాళ్లు

ప్రజాశక్తి -మధురవాడ : దేశంలో పట్టణ జనాభా పెరుగుతున్న కొద్దీ రవాణా అవసరాలను తీర్చడానికి మెట్రోరైలు ప్రాజెక్టుల అవసరం తప్పనిసరి అవుతోందని, అయితే వీటి నిర్మాణంలో సవాళ్లు కూడా అదే స్థాయిలో ఎదురవుతున్నాయని చెన్నై మెట్రో రైలు లిమిటెడ్ అదనపు జనరల్ మేనేజర్, రిటైర్డ్ వింగ్ కమాండర్ డి.గురునాథ్‌రెడ్డి పేర్కొన్నారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం సివిల్ ఇంజినీరింగ్ విభాగంలో గురువారం జరిగిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. మెట్రోరైలు ప్రాజెక్టులలో నూతన సాంకేతిక పరిజ్ఞానం, నిర్మాణంలో సవాళ్ళను ఆయన వివరించారు. గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డైరక్టర్ ప్రొఫెసర్ కె.నాగేంద్రప్రసాద్ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో సివిల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి ప్రొఫెసర్ ముకుందరావు, గీతం అలూమినీ రిలేషన్స్ డిప్యూటీ డైరక్టర్ పి.నవీన్ తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

అనుమతి లేని బాణసంచా విక్రయంపై కేసు నమోదు

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని సబ్బవరం మేజర్ పంచాయితీలో అనుమతి లేకుండా బాణసంచా విక్రయిస్తున్న నలుగురుపై కేసు నమోదు చేసినట్లు స్థానిక సిఐ పి.రంగనాథం తెలిపారు. నాగులచవితి సందర్భంగా సబ్బవరం మెయిన్ రోడ్డులో అనుమతులు లేకుండా తవ్వవానిపాలెంకు చెందిన దంగేటి సంతోష్ గుప్త, రెడ్డి పెంటరాజు, సబ్బవరంకు చెందిన పెన్నం శ్రీను, గాలిభీమవరంకు చెందిన వాకాడ రవి తేజ బాణసంచా విక్రయిస్తున్నారు. దీంతో వారిని స్థానిక పోలీసులు అదుపులోకి తీసుకుని బాణసంచాను స్వాధీనం చేసుకొని, వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

నేత్ర వక్రీభవన లోపాలపై అవగాహన

ప్రజాశక్తి - ఆరిలోవ : బాలల నేత్ర సంరక్షణా వారోత్సవాల్లో భాగంగా ఎల్‌వి ప్రసాద్ నేత్ర వైద్యశాల ఆధ్వర్యాన నేత్ర వక్రీభవన లోపాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు డాక్టర్ స్నేహల్ గణత్ర తెలిపారు. అంధత్వానికి ప్రధాన కారణం సవరించని వక్రీభవన లోపాలే కీలకం అని గణాంకాలు చెబుతున్నట్టు పేర్కొన్నారు. ఈ నెల 19న ఉదయం 6 గంటలకు బీచ్ రోడ్డులోని కాళీమాత ఆలయం నుంచి బాలల నేత్ర సంరక్షణా వాక్ నిర్వహించనున్నట్టు తెలిపారు. తల్లిదండ్రుల్లో ఒకరికి లేదా ఇద్దరకీ హ్రస్వ దృష్టి వంటివి ఉంటే పిల్లలలో వక్రీభవన లోపాలు పెరుగుదలకు కీలకమవుతాయన్నారు. ఎక్కువ సమయం స్క్రీన్ చూడటం, బహిరంగ ప్రదేశాలలో పనిచేయక పోవడం, ఆడుకోకపోవడం కూడా మయోపియాను పెంచుతుందని వివరించారు. పుస్తకాలు దగ్గరగా పెట్టుకొని చదువుతున్నా, టీవీని దగ్గరగా చూస్తున్నా, స్కూల్లో బ్లాక్ బోర్డు స్పష్టంగా కనిపించక పోయినా, తరచూ తలనొప్పి రావడం, కళ్లకు అలసట, కళ్లను నలుపుకొని చూడటం వంటివి పిల్లలు చేస్తుంటే తల్లిదండ్రులు వెంటనే నేత్ర వైద్యలను సంప్రదించి చికిత్స చేయించడం మంచిదని చెప్పారు.

'నగరాల కులస్తులకు న్యాయం చేయాలి'

ప్రజాశక్తి-పిఎం.పాలెం : నగరాల కులస్తులకు న్యాయం చేయాలని నగరాల కార్పొరేషన్ చైర్‌పర్సన్ పిళ్ళా సుజాత కోరారు. కులగణనకు సంబంధించి అనకాపల్లిలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. నగరాల కుటుంబ సభ్యులను పరిగణలోకి తీసుకొని ఆ సామాజిక వర్గానికి సంపూర్ణ న్యాయం చేయాలని కోరారు. గత ప్రభుత్వాలు నగరాలు సామాజిక వర్గాన్ని 40 వేలు మందిగా మాత్రమే పరిగణలోకి తీసుకోవడంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే రిజర్వేషన్లు, సంక్షేమ పథకాలకు దూరమయ్యారని తెలిపారు. బీసీ కులగణనలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రతి ఒక్క నగరాల కుటుంబ సభ్యులనూ పరిగణలోకి తీసుకోవాలని కోరారు.

వైసిపిలో చేరిన జనసేన నాయకులు

ప్రజాశక్తి -భీమునిపట్నం : జివిఎంసి నాలుగో వార్డు పరిధిలో సుమారు 50 మంది జనసేన నాయకులు, కార్యకర్తలు స్థానిక ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, మాజీ మంత్రి బాలరాజు సమక్షంలో గురువారం వైసిపిలో చేరారు. కాపులుప్పాడలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో జనసేన నాయకులు, కార్యకర్తలకు వైసిపి కండువా వేసి ముత్తంశెట్టి శ్రీనివాసరావు, మాజీ మంత్రి బాలరాజు వైసిపి లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా జనసేన నుంచి వైసిపిలో చేరిన నాయకులు మాట్లాడుతూ, జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేస్తే స్వాగతించే వారిమని, టిడిపితో పొత్తును తాము జీర్ణించుకోలేకనే రాజీనామా చేసి వైసిపిలో చేరినట్లు తెలిపారు. తామంతా మెగాస్టార్ చిరంజీవి అభిమానులమని, అప్పట్లో పిఆర్‌పిలో పనిచేశామని, ఆ పార్టీని కాంగ్రెస్‌లో విలీనం చేయడంతో అప్పట్లో బాధ పడ్డామని వివరించారు. ఈ కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ దౌలపల్లి కొండబాబు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.



వైసిపిలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ట్రాఫిక్ ఎస్ఐ అప్పలనాయుడు

ట్రాఫిక్‌పై అవగాహన అవసరం

ప్రజాశక్తి- గాజువాక : ట్రాఫిక్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని గాజువాక ట్రాఫిక్ ఎస్ఐ ఎన్.అప్పలనాయుడు అన్నారు. గాజువాక విడిఎ డిగ్రీ కళాశాలలో గురువారం ట్రాఫిక్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమించడం వల్ల ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని తెలిపారు. ప్రమాదాలు జరగకుండా జాగ్రత్త పడాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో విడిఎ డైరెక్టర్లు బి.శ్రీనివాసరావు, డిఎస్ఎన్.కృష్ణకుమార్, ప్రిన్సిపల్ కె.సీతాలక్ష్మి, అధ్యాపకులు పాల్గొన్నారు.


పనులను పరిశీలిస్తున్న డిప్యూటీ మేయర్ సతీష్

'వార్డును అభివృద్ధి పథంలో నడిపిస్తా'

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి 46వ వార్డులోని సమస్యలను పరిష్కరించడమే కాకుండా, వార్డును అభివృద్ధి బాటలో నడిపించేందుకు, సుందరంగా తీర్చిదిద్దేందుకు కృషిచేస్తున్నానని డిప్యూటీ మేయర్ కట్టమూరు సతీష్ చెప్పారు. 46వ వార్డు పరిధిలోని కైలాసపురం, మధుసూధన నగర్, కస్తూరినగర్, సూరిబాబునగర్, దుర్గాకైలాసనగర్ తదితర ప్రాంతాలలో ఆయన పర్యటించారు. రూ.కోటిన్నరతో అభివృద్ధి చేస్తున్న పనులను స్వయంగా పరిశీలించారు. రోడ్లు, కాలువల నిర్మాణాలు, గెడ్డలు, డ్రెయినేజీలు, కమ్యూనిటీహాళ్ల నిర్మాణాలను పరిశీలించి పనులు వేగవంతంచేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కో-ఆప్షన్ మేంబర్ సేనాపతి అప్పారావు, కె.చిన్న, ఎ.కృష్ణ, జి.అప్పారావు, ఎస్.రామారావు, కె.ఈశ్వరరావు, ఎన్.ఈశ్వరరావు, లావణ్య, బాల, నారాయణరెడ్డి, అప్పలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హార్టీకల్చర్ సొసైటీ ఎన్నిక ఏకగ్రీవం

ప్రజాశక్తి -గాజువాక : అగనంపూడి హార్టీకల్చర్ సొసైటీ ఎన్నికలు గురువారం జరిగాయి. మొత్తం 11 మంది డైరెక్టర్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఎన్నికల అధికారి బి.శ్రీనివాస్ మాట్లాడుతూ, సొసైటీ ఎన్నికలకు సంబంధించి 15 మంది నామినేషన్లు వేయగా నలుగురు ఉపసంహరించుకున్నారని తెలిపారు. దీంతో సొసైటీకి కావాల్సిన 11 మంది డైరెక్టర్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని వివరించారు. ఎన్నికైన వారిలో నెల్లి శ్రీనివాసరావు, విందుల ఈశ్వరరావు, మింది కన్నారావు, కడవల తాతారావు, కటకోటి అప్పారావు, జెర్రిపోతుల కృష్ణ, డిఎస్‌వి నర్సింగరావు, దాసరి భూషన్న, దాసరి సన్యాసిరావు, దుల్ల రామునాయుడు, సాలాపు సన్యాసిరావు ఉన్నారు. ఏకగ్రీవంగా ఎన్నికైన డైరెక్టర్లను ఎడిసి ఛైర్మన్ బలిరెడ్డి సత్యనారాయణ అభినందించారు. గ్రామ పెద్దలు సాలాపు అచ్చిబాబు, మరిసా రామచంద్రరావు, రమణ, బుదిరెడ్డి అప్పారావు, జాజుల తాతారావు, సేనాపతి నరసింహారావు, బుదిరెడ్డి అచ్చంనాయుడు, రమణ, సిడబ్ల్యుసి కారిదర్శి కరణం సైదిరాజు పాల్గొన్నారు.

సిసి రోడ్డుకు శంకుస్థాపన

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి 42వ వార్డు పరిధి మసీదు పక్కన సిసి రోడ్డు నిర్మాణానికి వార్డు కార్పొరేటర్ ఆళ్ల లీలావతి గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో స్థానికులు సిసి రోడ్డు ఏర్పాటును తమ దృష్టికి తీసుకురావడంతో ఈ పనులు చేపట్టినట్లు తెలిపారు. రూ.16 లక్షలతో రోడ్డు వేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు ఆళ్ల శ్రీనివాసరావు, షేక్ జుబేరా, ఎఇ రవణమ్మ, వర్క్ ఇన్‌స్పెక్టర్ సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

కల్వర్టు నిర్మాణానికి శంకుస్థాపన

జివిఎంసి 43వ వార్డులో కల్వర్టు నిర్మాణానికి వైసిపి కార్పొరేటర్ ఉషశ్రీ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రూ.9 లక్షల నిధులతో కల్వర్టు నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, జివిఎంసి అధికారులు పాల్గొన్నారు.

గుర్తింపు ఎన్నికల్లో సిఐటియును గెలిపించాలి

ప్రజాశక్తి -ములగాడ : షిప్‌యార్డులో ఈ నెల 18న జరిగే గుర్తింపు యూనియన్ ఎన్నికల్లో సిఐటియుకు ఓటు వేసి గెలిపించాలని ప్రధాన కార్యదర్శిగా పోటీచేస్తున్న ఎస్.ప్రసాద్ కోరారు. షిప్‌యార్డులో అనేక మందిని పర్మినెంట్ చేసే చరిత్ర సిఐటియుకు ఉందని గుర్తుచేశారు. కార్మిక హక్కులు, పరిశ్రమల రక్షణ కోసం సిఐటియు పోరాడుతోందన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మిక హక్కులను కాలరాస్తోందని, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేస్తోందని, దానికి ఇక్కడ ఐఎన్‌టియుసి, బిఎంఎస్‌లు సహకరిస్తున్నాయని తెలిపారు. ఈ రెండు యూనియన్లు 372 ఎల్ అండ్ ఎం సిరీస్ ఉద్యోగులను ఎచ్‌ఎస్ఎల్‌లోకి తీసుకొచ్చారని, దీనివల్లనే నేటికి వారికి పర్మినెంట్ కాలేదని వివరించారు. సిఐటియును గెలిపిస్తే ఎల్ అండ్ ఎం సిరీస్ సమస్యపై పోరాడతామని, మిగిలిన కార్మిక సమస్యలపై పనిచేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు బిఎస్ఎన్ రాజు, గౌరవాధ్యక్షులు కె.జానకిరాజు, విక్టర్‌ప్రసాద్, ప్రవీణ్, కల్యాణ్ పాల్గొన్నారు.


ప్రచారంలో పాల్గొన్న ప్రసాద్

బ్యాంకుల్లో అవుట్ సోర్సింగ్ నియామకాలపై నిరసన

ప్రజాశక్తి-సీతమ్మధార : బ్యాంకుల్లో ఖాళీగా ఉన్న క్లరికల్ పోస్టులను భర్తీచేయాలని, అవుట్ సోర్సింగ్ నియామకాలను వ్యతిరేకిస్తూ గురువారం విశాఖపట్నం జిల్లా బ్యాంక్ ఉద్యోగుల సమన్వయ సంఘం ఆధ్వర్యాన సీతమ్మధార యూనియన్ బ్యాంకు వద్ద నిరసన తెలిపారు. ఆల్ ఇండియా బ్యాంక్ ఎంప్లాయీస్ అసోసియేషన్ పిలుపు మేరకు చేపట్టిన ఈ నిరసన కార్యక్రమంలో సంఘం కార్యదర్శి ఆర్.వసంతరావు మాట్లాడుతూ, తమ డిమాండ్లపై కేంద్ర ప్రభుత్వం స్పందించకపోతే డిసెంబర్ మొదటి వారంలో విడతల వారీగా సమ్మె చేస్తామని, 2024 ఫిబ్రవరిలో దేశవ్యాప్త సమ్మె చేపడతామని తెలిపారు. ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి పడాల రమణ మాట్లాడుతూ, కేంద్రంలో మోడీ ప్రభుత్వం బ్యాంకింగ్ సెక్టార్‌ను నిర్వీర్యం చేస్తూ ప్రయివేటు బ్యాంకులను ప్రోత్సహిస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు మహేంద్రా, కమలాకర్, రమేష్, శ్రీనివాస్ కుమార్, ఆడారి శ్రీను, ఈశ్వర్, బ్యాంక్ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆంజనేయ ఆలయ ధర్మకర్తగా వెంకటలక్ష్మి

ప్రజాశక్తి -ములగాడ : ఆంజనేయ స్వామి దేవాలయం ధర్మకర్తగా బోసి వెంకటలక్ష్మి గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పశ్చిమ నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్, 61 వార్డు కార్పొరేటర్ కొణతాల సుధ సహకారంతో ఈ పదవి వరించడంపై కృతజ్ఞతలు తెలిపారు. ప్రమాణ స్వీకారానికి వచ్చిన పార్టీ శ్రేణులందరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు.



రాష్ట్రం నెంబర్-1లో ఉందనడం హాస్యాస్పదం

ప్రజాశక్తి-సీతమ్మధార : రాష్ట్రం నెంబర్-1 స్థానంలో ఉందని మంత్రి గుడివాడ అమర్‌నాథ్ చెప్పడం హాస్యాస్పదమని జనసేన కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ పేర్కొన్నారు. పౌరగ్రంథాలయంలో గురువారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, లిక్కర్ ద్వారా రూ.98 వేల కోట్లు దోచుకున్నందుకా?, గంజాయి సాగు, అక్రమరవాణాలోనా?, విద్యుత్ సక్రమంగా ఇవ్వలేని స్థితిలోనా?, ఉద్యోగుల జీతాల ఎప్పుడు వస్తాయో తెలియని పరిస్థితి ఉన్నందుకా?, రోడ్లు కూడా వేయలేని స్థితిలో ఉన్నందుకా?, అనకాపల్లిలో విస్సన్నపేట భూములు దోచుకున్నందుకా? రాష్ట్రం నెంబర్-1 స్థానంలో ఉందని ఎద్దేవాచేశారు. రాష్ట్రానికి ఒక్క పరిశ్రమనైనా తెచ్చారా అని ప్రశ్నించారు. జనసేన నాయకుడు నాదేండ్ల మనోహర్‌పై అమర్‌నాథ్ విమర్శలు చేయడం సరికాదన్నారు.

పలుచోట్ల 'ఎపికి జగన్ ఎందుకు కావాలి'

ప్రజాశక్తి-యంత్రాంగం

ఆంధ్రప్రదేశ్‌కు జగన్ ఎందుకు కావాలంటే కార్యక్రమాలను విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో పలుచోట్ల గురువారం నిర్వహించారు.

పద్మనాభం : మండలంలోని గంధవరం పంచాయతీలో ఆంధ్రప్రదేశ్‌కు జగన్ ఎందుకు కావాలి కార్యక్రమం నిర్వహించారు. గన్నవరం సర్పంచ్ జివికె.వర్మ రాజు, ఎంపిటిసి సభ్యులు రమణరాజుతో గ్రామంలో పారిశుధ్య పనులు, పరిశుభ్రత కార్యక్రమాలపై ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ, అందరూ కలిసికట్టుగా పనిచేసినప్పుడే అభివృద్ధి జరుగుతుందన్నారు. గ్రామీణ హెల్త్ కేంద్రాల ద్వారా వైద్యాన్ని అందుబాటులోకి తీసుకొచ్చినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రాంబాబు, మండల వైసిపి అధ్యక్షులు లక్ష్మణరావు, నాయకులు సోమనాయుడు, గోవింద, గణేష్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆనందపురం : మండలంలోని గండిగుండంలో సర్పంచ్ జి శ్రీనివాస్ ఆధ్వర్యాన నిర్వహించారు. ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు హాజరై మాట్లాడారు. నాలుగున్నరేళ్లలో వైసిపి ప్రభుత్వం గండిగుండం పంచాయతీలో అందించిన సంక్షేమ పథకాలతో ఏర్పాటుచేసిన ఫ్లెక్సీలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు బంక సత్యం, శ్రీను, బొట్ట ధనలక్ష్మి, రామకృష్ణ, బిఆర్‌పి.నాయుడు, బంటు చిన్న, లంక రాంబాబు, పినిశెట్టి సింహాచలంనాయుడు, ఎర్ర అప్పలనాయుడు, మదపాడ శ్రీను, చందక అప్పలస్వామి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లి : మండలంలోని మారేడుపూడి గ్రామంలో వై నీడ్స్ జగన్ టు ఏపీ కార్యక్రమం నిర్వహించారు. ఏపి ఇన్లాండ్ వాటర్ వేస్ అథారిటీ చైర్మన్ దంతులూరి దిలీప్ కుమార్, ఎంపిపి గొర్లి సూరిబాబు, వైసిపి మండల అధ్యక్షులు పెద్దిశెట్టి గోవింద ఆధ్వర్యాన మా నమ్మకం నువ్వే జగనన్న బోర్డు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో


మాట్లాడుతున్న దిలీప్ కుమార్

వైస్ ఎంపీపీ విల్లూరు కుమారి చంద్రశేఖర్, సర్పంచ్ సాలపు కనకరాజు, వైసిపి నాయకులు ఈగల కృష్ణమూర్తి, గన్ను వెంకునాయుడు, శేఖర్, రాయి రాజేష్, ఎంపిటీసీ ఈగల రామునాయుడు, ఎంపిడీవో నరసింహారావు, ఈవోపీఆర్డి ధర్మారావు పాల్గొన్నారు.

దేవరాపల్లి : మండల కేంద్రం దేవరాపల్లి సచివాలయం-1, 2 పరిధిలో ఏపికి జగన్ ఎందుకు కావాలి కార్యక్రమంలో భాగంగా నువ్వే మా నమ్మకం జగన్, పల్లెకి పోదాం కార్యక్రమాలు నిర్వహించారు. తొలుత వైసిపి జెండాను, సంక్షేమ పథకాల బోర్డును ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి, ఎంపిడిఓ సుబ్బలక్ష్మి, వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు కిలపర్తి భాస్కరరావు, మండల అధ్యక్షులు బూరె బాబురావు, కొటాన వెంకట రమణ పాల్గొన్నారు.

అచ్యుతాపురం : మండలంలోని దోసూరు గ్రామంలో జగన్ ఎందుకు కావాలి అనే కార్యక్రమాన్ని వైసిపి మండల అధ్యక్షులు దేశంశెట్టి శంకర్రావు ప్రారంభించారు. వైసిపి జెండాను ఆయన ఎగరవేశారు. గ్రామంలో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాల డిజిటల్ బోర్డు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కోన సంధ్య బుజ్జి, జెడ్పీటీసీ లాలం రాంబాబు, జెడ్పి కో ఆప్షన్ సభ్యులు నరమాల కుమార్, ఎంపిటిసి రావి శోభన్ బాబు, వైసిపి నాయకులు రాజాన విజయ్, గండి అప్పలనాయుడు, గండి అప్పారావు, గండి రాజు ఇతర నాయకులు పాల్గొన్నారు.

సబ్బవరం : మండల కేంద్రం పెద నాయుడుపాలెం సచివాలయం-3లో ఏపికి జగన్ ఎందుకు కావాలి కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిపి బోకం సూర్యకుమారి రామునాయుడు, మాజీ ఎంపిపి సబ్బవరపు ముత్యాల నాయుడు, వైసీపీ నేతలు కోటాన రాము, కర్రి బాబు, సబ్బవరపు బుజ్జి, సబ్బవరపు నాగభూషణం, సచివాలయ సిబ్బంది, ఈఓపిఆర్‌డి మహేష్ పాల్గొన్నారు.

చీడికాడ : మండల కేంద్రంలో ఎంపిపి జయమ్మ ఆధ్వర్యంలో ఏపికి జగనే ఎందుకు కావాలి కార్యక్రమం నిర్వహించారు. ఎంపిపి జయమ్మ మాట్లాడుతూ, రాజకీయాలు, కుల, మత,వర్గాలకు అతీతంగా అభివృద్ధి, సంక్షేమ పథకాలను ముఖ్యమంత్రి జగన్. మాడుగుల నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేసిన ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడును మళ్లీ గెలిపించుకోవాలన్నారు. వైసిపి మండల అధ్యక్షులు గొల్లవిల్లి రాజుబాబు, యువజన అధ్యక్షుడు స్వామి నాయుడు, జిల్లా రైతు విభాగం అధ్యక్షులుయర్ర అప్పారావు, మండల సచివలయాల కన్వీనర్ ఈర్లె చైతన్య, గ్రామ పార్టీ అధ్యక్షులు పరవాడ మహేష్ కార్యకర్తలు అప్పారావు పాల్గొన్నారు

రోలుగుంట : మండలంలోని కొవ్వూరు గ్రామంలో ఎంపిపి యర్రంశెట్టి శ్రీనివాసరావు అధ్యక్షతన ఏపికి జగనే ఎందుకు కావాలి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ అర్హులందరికీ సంక్షేమం, సచివాలయ వ్యవస్థతో ప్రజల ముంగిటకే పాలనను తీసుకొచ్చిన జగన్‌నుమళ్లీ గెలిపించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కాంతం, నాయకులు రామన్న, అధికారులు పాల్గొన్నారు.

గొలుగొండ:మండల కేంద్రమైన గొలుగొండలో గురువారం ఏపికి జగనే ఎందుకు కావాలి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైసిపి జెండాను ఆవిష్కరించారు. సభలో వైసిపి మండలాధ్యక్షులు లెక్కల సత్యనారాయణ, సర్పంచ్ కసిపల్లి బుజ్జి(అప్పారావు), వైస్ ఎంపిపి సుర్ల ఆదినారాయణ పాల్గొన్నారు.

శంకరయ్యకు సిపిఎం ఘన నివాళి

విశాఖ, అనకాపల్లిల్లో సంతాప సభలు

ప్రజాశక్తి-అనకాపల్లి

స్వాతంత్ర్య సమరయోధులు, సిపిఎం వ్యవస్థాపక సభ్యుల్లో ఒకరైన తమిళనాడు రాష్ట్ర మాజీ కార్యదర్శి కామ్రేడ్ ఎన్.శంకరయ్య మృతి దేశంలో కమ్యూనిస్టు ఉద్యమానికి, ముఖ్యంగా సిపిఎంకు తీరని లోటని సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి కె.లోకనాథం, కార్యదర్శివర్గ సభ్యులు జి.కోటేశ్వరరావు అన్నారు. శంకరయ్య ఆశయ సాధనకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని కోరారు. సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యాలయంలో గురువారం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు అల్లు రాజు అధ్యక్షత జరిగిన సంతాప సభలో శంకరయ్య చిత్రపటానికి లోకనాథం, కోటేశ్వరరావు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థి దశలోనే శంకరయ్య స్వాతంత్రోద్యమంలో పాల్గొన్నారని, 1940లో ఆయన కమ్యూనిస్టు పార్టీలో చేరి, తమిళనాడులో పార్టీ నిర్మాణానికి విశేష కృషి చేశారని తెలిపారు. కమ్యూనిస్టు రాజకీయాలను, విధానాలను ప్రజలకు సమర్థవంతంగా వివరించే మంచి వాగ్దాటి ఉన్న నాయకుడని పేర్కొన్నారు. అంకిత భావం, నిబద్ధత కలిగిన ఆయన తుదిశ్వాస వరకూ నమ్మిన సిద్ధాంతం కోసం పరితపించారని కొనియాడారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఆర్.శంకరరావు, గంటా శ్రీరామ్, వివి.శ్రీనివాసరావు, గనిశెట్టి సత్యనారాయణ, నాయకులు కర్రి అప్పారావు, కె.ఈశ్వరరావు, బి.ఉమామహేశ్వరావు, తెల్లయ్యబాబు, పి.చలపతి, నూకఅప్పారావు తదితరులు పాల్గొన్నారు.


నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు రాము తదితరులు

అచ్యుతాపురం : కమ్యూనిస్టు యోధుడు ఎన్.శంకరయ్య మృతికి సిపిఎం అచ్యుతాపురం మండల నాయకులు తీవ్ర సంతాపం తెలిపారు. ఈ మేరకు మండల కేంద్రంలో శంకరయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం అచ్చుతాపురం కన్వీనర్ ఆర్.రాము మాట్లాడుతూ 9 సంవత్సరాల వయస్సులోనే భగత్ సింగ్ ఉరిని వ్యతిరేకిస్తూ బ్రిటీష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ర్యాలీలో శంకరయ్య పాల్గొన్నారని తెలిపారు. 1941లో బ్రిటిష్ ప్రభుత్వం ఆయన్ను అరెస్టు చేసి స్వాతంత్ర్యం వచ్చేవరకు ఎనిమిదేళ్లపాటు జైలులో నిర్బంధించిందని పేర్కొన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల పెన్షన్ తీసుకోవడానికి నిరాకరించారని, తమిళనాడు ప్రభుత్వం శంకరయ్యకు అవార్డు, రూ.10 లక్షలు ప్రకటిస్తే ఆ మొత్తం కరోనా బాధితులకు ఖర్చు చేయాలని ఆ ప్రభుత్వానికి తిరిగి ఇచ్చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు కె.సోమునాయుడు, కిట్టు, పైడ్రాజు, రమణ పాల్గొన్నారు.

శంకరయ్యకు సిపిఎం నివాళి

ఎంవిపి.కాలనీ : స్వాతంత్ర్య సమరయోధులు, సిపిఎం మొదటితరం నాయకులు ఎన్.శంకరయ్యకు సిపిఎం విశాఖ జిల్లా కమిటీ ఘన నివాళ్లర్పించింది. మద్దిలపాలెంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన సంతాప కార్యక్రమంలో శంకరయ్య చిత్రపటానికి జివిఎంసి 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు, పార్టీ సీనియర్ నాయకులు జివిఎస్.చలపతి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా గంగారావు మాట్లాడుతూ శంకరయ్య బ్రిటీష్ ప్రభుత్వ దోపిడీకి వ్యతిరేకంగా, భారతదేశంలో సంపూర్ణ స్వాతంత్ర్యం కోసం పోరాడిన తమిళనాడు కమ్యూనిస్టుయోధుడని కొనియాడారు. ఏడేళ్ల జీవితం గడిపారని చెప్పారు. మతోన్మాదానికి, సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడారని తెలిపారు. మూడుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికై ప్రజా సమస్యలపై చట్టసభల్లో గళం విప్పారని తెలిపారు. దోపిడీ లేని సమాజం స్థాపించడం, కార్మిక, కర్షకుల సమస్యలపై నిరంతరం పనిచేయడమే ఆయనకిచ్చిన ఘన నివాళి అన్నారు. సంతాప సభలో పార్టీ నాయకులు ఆర్‌కెఎస్‌వి.కుమార్, పి.మణి, వి.కృష్ణారావు, యుఎస్ఎన్.రాజు, ప్రదీప్, రమణ, త్రినాధ్, కుమారి, తులసీరాం పాల్గొన్నారు.


విశాఖలో నివాళ్లర్పిస్తున్న గంగారావు, తదితరులు


రోడ్డు పనులను పరిశీలిస్తున్న వైసిపి నేత రత్నాకర్

రూ.1.96 కోట్లతో రోడ్డు విస్తరణ

ప్రజాశక్తి- అనకాపల్లి : స్థానిక డైట్ కాలేజీ జంక్షన్ నుంచి సుంకరమెట్ట జంక్షన్ వరకు జీవీఎంసీ నిధులు సుమారు కోటి 96 లక్షల రూపాయలలో విస్తరణ పనులు చేపట్టినట్లు వైసీపీ పార్లమెంట్ పరిశీలకులు దాడి రత్నాకర్ తెలిపారు. 80వ వార్డు కార్పొరేటర్ కొణతాల నీలిమ భాస్కర్ ప్రతిపాదన మేరకు నిధులు మంజూరైనట్లు చెప్పారు. ఈ మేరకు విస్తరణ పనులను కార్పొరేటర్ కొణతాల నీలిమ భాస్కర్, జీవీఎంసీ ఈఈ చిరంజీవి, ఏఈ సుమిత్రతో కలిసి గురువారం రత్నాకర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఈ రహదారి ఎంతో అధ్వాన్నంగా ఉండడంతో హైవే అథారిటీ వారితో మాట్లాడి రోడ్డు వేయించడం జరిగిందన్నారు. ఆ సమయంలోనే డైట్ జంక్షన్ నుంచి సుంకర్‌మెట్ట జంక్షన్ వరకు 60 అడుగుల మేర సుమారు 1.2 కిలోమీటర్లు రహదారి విస్తరణ చేసేందుకు కార్పొరేటర్ నీలిమ ద్వారా ప్రతిపాదనలు పంపగా, నిధులు మంజూరైనట్లు చెప్పారు. దీనిలో భాగంగా 4 అడుగుల మేర డివైడర్‌తో పాటు మధ్యలో పూర్తిస్థాయిలో లైటింగ్ ఏర్పాటు చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో 80వ వార్డు వైసీపీ ఇన్‌ఛార్జి కొణతాల భాస్కరరావు, శిలపరశెట్టి బాబి, మొల్లి రమణబాబు, ఆళ్ల ప్రవీణ్, రేబాక ఇంద్రకుమార్, మళ్ల రామచంద్రరావు, ఉండ్రాళ్ల కన్నారావు, కొణతాల పరదేశినాయుడు, కోటిపల్లి శ్రీను, సాలాపు నాగేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

పత్రికా స్వేచ్ఛను కాపాడాలని వినతి

ప్రజాశక్తి- అనకాపల్లి : జాతీయ పత్రికా దినోత్సవాన్ని పురస్కరించుకొని పత్రికా స్వేచ్ఛను కాపాడాలని కోరుతూ అనకాపల్లి జిల్లా జర్నలిస్ట్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (జాప్) అధ్యక్షులు దాడి వెంకటరావు, ప్రధాన కార్యదర్శి ఎస్.అజయ్ ప్రసాద్ ఆధ్వర్యంలో గురువారం అనకాపల్లి ఆర్డీవో ఎజి.చిన్ని కృష్ణకి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా నిలిచే పత్రిక స్వేచ్ఛ నేడు హరించుకుపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. జర్నలిస్టులపై దాడులను అరికట్టేలా చట్టాలను అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు సాయిరాం, ఉపాధ్యక్షులు విజయ్ కుమార్, కొమ్మోజు రమేష్, సహాయ కార్యదర్శి ఎస్‌వివి రామచంద్రరావు పాల్గొన్నారు.

'స్నేహ చిరుమువ్వలు' ప్రత్యేక సంచిక ఆవిష్కరణ

ప్రజాశక్తి -తగరపువలస : బాలల దినోత్సవం సందర్భంగా ప్రజాశక్తి ముద్రించిన "స్నేహ చిరు మువ్వలు" పిల్లల ప్రత్యేక సంచికను గురువారం చిట్టివలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం పొట్నూరు మురళీమోహనరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

సబ్ జైల్లో ఆర్ఒ ప్లాంటు ఏర్పాటుకు వినతి

ప్రజాశక్తి- అనకాపల్లి : స్థానిక సబ్ జైల్లో ఖైదీలు, జైలు సిబ్బందికి తాగునీటికి అవసరమైన ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేయాలని కోరుతూ గురువారం పార్లమెంట్ సభ్యులు డాక్టర్ బివి.సత్యవతికి సబ్ జైల్ సూపరింటెండెంట్ వైఎస్.గణేశ్ రెడ్డి కలిసి వినతి పత్రం అందజేశారు. ముందుగా ఎంపీ సత్యవతిని దుశ్శాలువా,పూల బొకేను అందజేసి చిరు సత్కారం చేశారు. అనంతరం మాట్లాడుతూ నూతన జిల్లా ప్రధాన కేంద్రం అనకాపల్లి పట్టణంలో గల గ్రేడ్ 1 సబ్ జైల్ లో ఖైదీల సంస్కరణలు, సదుపాయాల్లో భాగంగా తాగు నీరు సదుపాయం కొరకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సిద్ధార్థ సోషల్ సర్వీస్, కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షులు బల్లా నాగభూషణం, సబ్ జైల్ వార్డర్ డి.దుర్గా భవానీరావు, మాజీ జైల్ చీఫ్ హెడ్ వార్డర్ మైలపల్లి నూకరాజు పాల్గొన్నారు.


ఎంపీకి వినతిపత్రం ఇస్తున్న సబ్ జైల్ సూపరింటెండెంట్ తదితరులు



మాట్లాడుతున్న టిడిపి జిల్లా అధ్యక్షులు నాగజగదీష్

కేంద్ర నిధులు రాక కుంటుపడిన రాష్ట్ర అభివృద్ధి

ప్రజాశక్తి-అనకాపల్లి : వివిధ కేంద్ర పథకాలకు జగన్ రెడ్డి రంగుల పిచ్చితో కేంద్రం నుంచి రావలసిన నిధుల నిలుపుదల వల్ల రాష్ట్ర అభివృద్ధి కుంటుపడిందని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు బుద్ద నాగ జగదీశ్వరరావు ఆరోపించారు. స్థానిక పార్లమెంటరీ పార్టీ కార్యాలయంలో గురువారం పార్టీ జిల్లా కార్యదర్శి కొప్పుల జగన్, అధికార ప్రతినిధి విల్లూరు రమణబాబుతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో 20 కు పైగా పథకాలకు జగనన్న పేరు, దాదాపు 55 పథకాల కార్యక్రమాలకు వైయస్సార్ పేరు పెట్టారని, చివరకు కేంద్ర పథకాలను కూడా వదలకుండా జగనన్న, వైఎస్ఆర్ పేర్లు తగిలించి తమ పథకాలుగా ప్రచారం చేసుకోవడంతో కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి ఇవ్వాల్సిన 4,000 కోట్లు పైగా ఇవ్వకుండా ఆపిందని పేర్కొన్నారు. ప్రభుత్వ కార్యాలయాలకు, పంచాయతీ భవనాలకు, సచివాలయాలకు, జగన్ రెడ్డి రంగులు పూయడం వలన హైకోర్టు, సుప్రీంకోర్టు మొట్టికాయలు వేయడంతో వేసిన రంగులను చెరిపి వేయడానికి దాదాపు వేలకోట్ల రూపాయలు ప్రజాధనం దుర్వినియోగం అయిందని, ఇది ఎవడబ్బ సొమ్మని ప్రశ్నించారు. ఇప్పటికైనా రంగుల పిచ్చి, లోగోల పిచ్చి తగ్గించుకోవాలని హితవుపలికారు.

సంక్షేమ పథకాలతో పేదలకు మేలు

ప్రజాశక్తి -బుచ్చెయ్యపేట : ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలతో పేదలు ఆర్థికంగా బలోపేతమై మేలు జరిగిందని స్థానిక శాసనసభ్యులు కరణం ధర్మశ్రీ అన్నారు. మండలంలోని కందిపూడిలో గురువారం పల్లెనిద్ర కార్యక్రమంలో ధర్మశ్రీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్‌కే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో జడ్పిటిసి దొండ రాంబాబు, వైసిపి మండల అధ్యక్షులు జోగా కొండబాబు, మండల నాయకులు దాకారపు నాగరాజు, స్థానిక సర్పంచ్ కొప్పాక గణపతిరావు, పెద్దడ అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు

27 నుంచి కుల గణన

జిల్లా కలెక్టర్ రవి పట్టన్ శెట్టి


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి

ప్రజాశక్తి- అనకాపల్లి

ఈనెల 27వ తేదీ నుండి కుల గణన చేపడుతున్నట్లు కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి తెలిపారు. దీనికి సంబంధించి అభిప్రాయాలను తెలుసుకునేందుకు రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందని వెల్లడించారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలో బీసీ, ఎస్సీ, ఎస్ టి సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన సచివాలయ వ్యవస్థ ద్వారా ఈనెల 27వ తేదీ నుండి ఇంటి సర్వే నిర్వహిస్తారని చెప్పారు. ముందుగా వివిధ కులాలు సామాజిక వర్గాల నాయకులు ప్రముఖుల సలహాలు సూచనలు అభ్యంతరాలను విశాఖపట్నంలో జరిగే రీజనల్ కమిటీ సమావేశానికి పంపించడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో వివిధ కులాలకు సంబంధించి ప్రస్తుత సామాజిక విద్యా ఆర్థిక పురోభివృద్ధి గురించి వాస్తవ పరిస్థితులను తెలియజేయాలని కోరారు. 17- 18 తేదీలలో ఎంపిక చేసిన జిల్లా, డివిజనల్ అధికారులకు, 20-22 తేదీలలో సూపర్వైజర్లు, ఎన్యూమరేటర్లు సచివాలయ సిబ్బందికి శిక్షణ తరగతులు ఉంటాయని చెప్పారు. కార్యక్రమంలో చోడవరం శాసనసభ్యులు కరణం ధర్మశ్రీ, జిల్లా రెవెన్యూ అధికారి బి. దయానిధి, బీసీ సంక్షేమ అధికారి కే.రాజేశ్వరి, సిపిఓ జి.రామారావు, జిల్లా పంచాయతీ అధికారి ఆర్.శిరీష రాణి, డ్వామా పిడి ఈ.సందీప్, సాంఘిక సంక్షేమ శాఖ డిడి అజయ్ బాబు, గిరిజన సంక్షేమ శాఖ ఏటిడబ్ల్యుఒ నాగ శిరీష, జడ్పీ వైస్ చైర్ పర్సన్ బి వరాహ సత్యవతి, గవర, యాత, నగర, నాగవంశం కార్పొరేషన్ల చైర్మన్లు బొడ్డేడ ప్రసాద్, వి.అప్పలకొండమ్మ, పిల్లి సుజాత, బొద్దు అప్పలకొండమ్మ, కొప్పుల వెలమ, పెరిక జంగం కార్పొరేషన్ డైరెక్టర్లు గొర్లె అప్పలనాయుడు, జగదీష్, ఏ సోమేశ్వరరావు, డీపీఎంసీ నెంబర్లు ఎం.అప్పలరాజు, మధు, అప్పారావు, వివిధ కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా సత్యసాయి జయంతి వేడుకలు

ప్రజాశక్తి- అనకాపల్లి

పట్టణంలోని గవరపాలెం నిదానందొడ్డి వద్ద శ్రీసత్యసాయి మందిరంలో శ్రీసత్యసాయిబాబా 98వ జయంతి వేడుకలు గురువారం ఉదయం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ వేడుకల్లో ముఖ్యఅతిథిగా వైసీపీ పార్లమెంట్ పరిశీలకులు దాడి రత్నాకర్ పాల్గొని ముందుగా బాబా వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం 9 గంటలకు రత్నాకర్ చేతులమీదుగా సత్యసాయిబాబా వారి పతాక ఆవిష్కరణ చేశారు. ఈ నెల 16వ తేదీ నుంచి 23వ తేదీ వరకు నిర్వహించే సత్యసాయిబాబా వారి జయంతి వేడుకల్లో భక్తులు పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ 80వ వార్డు కార్పొరేటర్ కొణతాల నీలిమ భాస్కర్, సిలపరశెట్టి బాబీ, దీరజ్, వామాల కాశీ, కటారి దేముడు, బుద్ద జగన్, పలకా కాసులు, రేబాక ఇంద్రకుమార్, కొణతాల సన్యాసినాయుడు, సత్యసాయి బాబా సేవా సమితి సభ్యులు మళ్ల సత్యసాయి, కొణతాల మహేశ్వరనాయుడు పాల్గొన్నారు.

డిసిసిబి చైర్మన్ అనుచరుల నుండి రక్షణకు వినతి

ప్రజాశక్తి - పరవాడ : డిసిసిబి చైర్మన్ కోలా గురువులు, ఆయన అనుచరులు నుండి తనకు, తన భూమికి రక్షణ కల్పించాలని ముత్యాలమ్మ పాలెం గ్రామానికి చెందిన చింతకాయల సుజాత ముత్యాలు వెన్నలపాలెం కల్యాణ మండపంలో బుధవారం జరిగిన ప్రత్యేక స్పందన కార్యక్రమంలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ముత్యాలమ్మపాలెం పంచాయతీ పరిధి చీపురుపల్లి తూర్పు ఖండం సర్వే నెంబరు 332/1ఎ ఎకరం వ్యవసాయ భూమి చుట్టూ పెన్సింగ్ వేసి తాము సాగు చేస్తున్నామని, దీనికి పట్టాదార్ పాస్ పుస్తకాలు, టైటిల్ డీడ్, అడంగల్‌లు కూడా ఉన్నాయని ఆ వినతిపత్రంలో తెలిపారు. ఈ నెల 14న పది గంటల సమయంలో విశాఖపట్నం డిసిసిబి చైర్మన్ కోలా గురువులు ఆదేశాలు మేరకు ఆయన తాలూక బ్రోకర్లు బొంది అచ్చిబాబు, మరి కొందరు ప్రవేశించారని పేర్కొన్నారు. కోలా గురువుల తన అధికారాన్ని అడ్డుపెట్టుకొని పరవాడ పోలీసులు, రెవెన్యూ అధికారులపై రాజకీయ ఒత్తిడి చేసి, దౌర్జన్యంగా చేయడానికి, తనపై దాడులు చేసి అక్రమంగా తప్పుడు కేసులు బనాయించడానికి ప్రయత్నిస్తున్నారని పేర్కొన్నారు. కోలా గురువులు, ఆయన అనుచరులు దిబ్బపాలెం గ్రామానికి చెందిన బొంది అచ్చిబాబు, ఇతరులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని చింతకాయల సుజాత ముత్యాలు కోరారు.

యాదవ సంక్షేమ సంఘం కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి- అనకాపల్లి : అనకాపల్లి జిల్లా యాదవ సంక్షేమ సంఘం అనకాపల్లి నియోజకవర్గం నూతన కార్యవర్గం ఎన్నిక గురువారం జరిగింది. సంఘం కార్యాలయంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కరక సోమునాయుడు యాదవ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఈ ఎన్నిక జరిగింది. యాదవ సంక్షేమ సంఘం నియోజకవర్గ గౌరవాధ్యక్షులుగా గోకువాడ శ్రీరాములు, అధ్యక్షులుగా పంచదార్ల సూరిబాబు, ప్రధాన కార్యదర్శిగా ఒమ్మి రాము, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మొల్లి నాగు, వర్కింగ్ కార్యదర్శిగా కుండ్ల రామకృష్ణ, సహాయ కార్యదర్శిగా ఎదురు అప్పలరాజు, కోశాధికారిగా అయిత రాముతో పాటు ఐదుగురు ఉపాధ్యక్షులు, ప్రచార కార్యదర్శిగా నంబారు సత్యారావు, మీడియా సెల్ అధ్యక్షునిగా బొట్ట శ్రీను, అధికార ప్రతినిధిగా మొల్లి భాను, మరికొందరు కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో సంఘం అనకాపల్లి మండల అధ్యక్ష కార్యదర్శులు పంచదార్ల కన్నారావు, నంబారు రమణ, కసింకోట అధ్యక్ష కార్యదర్శులు కరక రాజు, ఎస్. నాని బాబు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో నాగుల చవితి

ప్రజాశక్తి- కె.కోటపాడు : మండల ప్రజలు నాగుల చవితి వేడుకలు గురువారం భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ ఏడాది నాగుల చవితి గురు శుక్రవారాల్లో రెండు రోజులు ఉండడంతో కొంతమంది గురువారం జరుపుకోగా, మరి కొంతమంది శుక్రవారం జరుపుకొనేందుకు సిద్ధమవుతున్నారు. పట్టణాల్లో ఉంటున్న వారు సైతం తమ స్వగ్రామాలకు వచ్చి కుటుంబ సమేతంగా పాలు, నువ్వులతో తయారు చేసిన చిమ్మిడిని పుట్టలో వేసి పూజలు చేశారు. ముఖ్యంగా రైతులు ఈ నాగుల చవితి పండుగను తమ పొలాల వద్ద ఉన్న పుట్టల వద్ద జరుపుకున్నారు.

ఆర్య వైశ్య సంఘం ఆత్మీయ సమావేశం

ప్రజాశక్తి- దేవరాపల్లి : ఆర్య వైశ్య సంఘం వారి ఆత్మీయ సమావేశం స్థానిక ద్రోణం రాజు కళ్యాణ మండపంలో గురువారం నిర్వహించారు. ఇందులో ముఖ్య అతిథిగా ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు పాల్గొని మాట్లాడారు. ఆర్య వైశ్య కుటుంబాల్లో తన ఒక సభ్యుడనే పేర్కొన్నారు. దేవరాపల్లిలో త్వరలో నిర్మాణం కానున్న వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయ నిర్మాణానికి తనవంతు సహాయ సహకారాన్ని అందిస్తానని చెప్పారు. అనంతరం ఉప ముఖ్యమంత్రిని ఆర్యవైశ్య మహిళలు, సభ్యులు సాలువతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, వైసిపి నాయకులు డాక్టర్ వి.సింహాచలం నాయుడు, బూరె బాబురావు, లలితా నాయుడు, గండిపడాల అప్పలరాజు, గుండు రాంబాబు, ఆర్యవైశ్య సభ్యులు కొల్లూరు పైడిశెట్టి, వెత్సా రమేష్, పసుమర్తి విశ్వేశ్వరరావు, వెచ్చ రాజేష్ పాల్గొన్నారు.



డిప్యూటీ సిఎంను సత్కరిస్తున్న ఆర్యవైశ్య మహిళలు

సేంద్రియ వ్యవసాయంతో ఆరోగ్యకర పంటలు



శాస్త్రవేత్తను సత్కరిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-అనకాపల్లి

సేంద్రియ వ్యవసాయ విధానం వల్ల ఆరోగ్యకరమైన పంటలు పండడంతో పాటు భూ సారం పెరుగుతుందని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ పరిశోధన సంచాలకులు డాక్టర్ ఎల్ ప్రశాంతి పేర్కొన్నారు. స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో జాతీయ వ్యవసాయ ఉన్నత విద్యా పథకం సౌజన్యంతో రాష్ట్రవ్యాప్తంగా 30 మంది వ్యవసాయ శాస్త్రవేత్తలకు సేంద్రియ, సహజ సేంద్రియ వ్యవసాయ విధానంపై పది రోజులపాటు ఇచ్చే శిక్షణ కార్యక్రమాన్ని ఆర్ఏఆర్ఎస్ ఏడిఆర్ డాక్టర్ పివికె.జగన్నాథరావు ఆధ్వర్యంలో గురువారం ప్రారంభించారు. రసాయన ఎరువులు వినియోగంతో భూసారం తగ్గడంతో పాటు పర్యావరణ సమస్యలు తలెత్తుతున్న నేపథ్యంలో సేంద్రీయ వ్యవసాయ విధానంపై దృష్టి సాధించాల్సిన అవసరం ఉందని డాక్టర్ ప్రశాంతి పేర్కొన్నారు. ఏడిఆర్ డాక్టర్ జగన్నాథరావు మాట్లాడుతూ తమ ఆర్ఎఆర్ఎస్‌లో ఆ దిశగా పరిశోధనలు జరుగుతున్నాయన్నారు. సేంద్రియ ఉత్పత్తులు నేడు విదేశాలకు పెద్ద ఎత్తున ఎగుమతి అవుతున్నాయన్నారు. ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ డీన్ ఆఫ్ అగ్రికల్చర్ డాక్టర్ కరుణ సాగర్, శిక్షణ కార్యక్రమ సంచాలకులు డాక్టర్ రామలక్ష్మి మాట్లాడుతూ ఇటీవల సేంద్రీయ వ్యవసాయం సాగుచేసే రైతుల సంఖ్య పెరిగిందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ విశ్వవిద్యాలయ పాలకమండలి సభ్యులు డాక్టర్ పి గురుమూర్తి, సాయి లక్ష్మి, చెరకు ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఆదిలక్ష్మి, డాక్టర్ కెవి రమణ మూర్తి, శాస్త్రవేత్తలు డాక్టర్ సిహెచ్ ముకుందరావు, డాక్టర్ శిరీష, డాక్టర్ విశాలాక్షి, డాక్టర్ సరిత, కుమారి రాజేంద్రప్రసాద్, గోపాలస్వామి పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

విశాఖ డెయిరీ చైర్మన్ సొంత నిధులతో

వికలాంగునికి గృహ నిర్మాణం

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట

మండలంలోని పెదపూడి గ్రామానికి చెందిన వికలాంగుడు వియ్యపు సోమునాయుడుకు విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్ కుమార్ తన సొంత నిధులతో పక్కా ఇల్లు నిర్మించారు. ఇంటి నిర్మాణ ప్రారంభంలో రూ.75వేలు, కొంత సామగ్రి సమకూర్చారు. తాజాగా గురువారం మరో రూ.75 వేలు అందించారు. ఈ నగదును విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, వైసిపి మండల నాయకుల చేతుల మీదుగా సోమునాయుడుకు గురువారం అందజేశారు. వికలాంగుడైన సోమునాయుడుకు ఇల్లు లేకపోవడంతో మండల వైసిపి నాయకులు, విశాఖ డెయిరీ డైరెక్టర్ సత్యనారాయణ గతంలో ఆనంద్ కుమార్ దృష్టికి తీసుకువెళ్లారు. దీనికి స్పందించిన ఆనందకుమార్ ఇంటికి నిర్మాణానికి రూ.1,50,000 నగదు, కొంత సామగ్రి సమకూర్చారు. ఇంటి నిర్మాణం పూర్తి కావడంతో ఆనందనిలయం అని పేరు



ఆర్థిక సాయం అందిస్తున్న విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల

పెట్టుకున్నాడు. ఆశ్రయం కల్పించిన ఆడారి ఆనంద్ కుమార్‌కు, డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణకు సోమునాయుడు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు కొల్లిమల్ల అచ్చం నాయుడు, సర్పంచ్ వర కృష్ణ, మాజీ ఎంపిటిసి వెంకటపతిరాజు తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో శివస్వామి మృతి

ప్రజాశక్తి-అచ్యుతాపురం

మండలంలోని తిమ్మరాజుపేట గ్రామానికి చెందిన మల్ల శివ సత్యనారాయణ (శివ స్వామి) బుధవారం రాత్రి నిద్రలో ఉండగా గుండెపోటుతో అకాలంగా మృతి చెందాడు. శివ స్వామి 1985వ సంవత్సరం నుంచి నేటి వరకు 38 సార్లు అయ్యప్ప స్వామి మాలధారణ వేశారు. శబరిమలై యాత్రకు అయ్యప్ప స్వాములతో కలిసి ఆయన ఆధ్వర్యంలో కాలినడకన సైకిల్ యాత్రలు సాగించారు. గ్రామంలో నూతనంగా నిర్మించిన దుర్గంబిక ఆలయంలో అమ్మవారి ఆలయ పూజారిగా కొనసాగుతున్నారు. ఆయన సారథ్యంలో తిమ్మరాజుపేటలో ఆధ్యాత్మికత కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. బుధవారం రాత్రి మునగపాకలో జరిగిన అయ్యప్ప స్వామి పూజ కార్యక్రమంలో ఆయన చాలా చురుకైన పాత్ర పోషించి భక్తి పాటలు పాడారు. శివ స్వామి అకాల మృతితో తిమ్మరాజుపేట గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఆయన అంతిమయాత్రలో గ్రామస్తులు, జిల్లా నలుమూలల నుండి మిత్రులు పాల్గొన్నారు.



శివ స్వామి (ఫైల్‌ఫొటో)

ఎండుతున్న వరి పంటలు

ఆందోళనలో రైతులు

ప్రజాశక్తి-కశింకోట

తీవ్ర వర్షాభావ పరిస్థితుల వల్ల మండలంలోని పలు గ్రామాల్లో వరి పంటలు ఎండిపోతున్నాయి. దీంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. కశింకోట మండలంలో ప్రధానంగా వరి, కూరగాయలు, చెరుకు పంటలు ఎక్కువగా పండించడం జరుగుతుంది. గతంలో వర్షాలు సకాలంలో కురవడం వల్ల వరి పంట ఎక్కువగా పండించేవారు. ప్రధానంగా రంగుబోలు రిజర్వాయర్, నర్సాపురం బ్యారేజ్‌తోపాటు మామిడివాక గెడ్డ, పందిగెడ్డ ద్వారా పంటలకు నీరు అందేది. బయ్యవరం పెద్ద చెరువులో పుష్కలంగా నీరు ఉండేది. అయినా ఈ ఏడాది వర్షాలు లేకపోవడంతో పై నీటి వనరుల నుండి సాగునీరు అందని పరిస్థితి నెలకొంది. దీంతో వరి పంటలు ఎండిపోయాయి. పెట్టిన పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదని, తమను ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

ప్రభుత్వం పరిహారం చెల్లించాలి



నేను 30 వేలు పెట్టుబడి పెట్టి ఎకరన్నర భూమిలో వరిపంట వేశాను. వర్షాలు లేక పంట ఎండిపోయింది. పశువులకు కూడా గడ్డి లేని పరిస్థితి. పంట నష్టానికి ప్రభుత్వం పరిహారం చెల్లించాలి.

- లాలం సత్యారావు, రైతు, బయ్యవరం గ్రామం

కరువు మండలంగా ప్రకటించాలి



అనకాపల్లి జిల్లాను, కశింకోట మండలాన్ని కరువు ప్రాంతాలుగా ప్రకటించి రైతులను ఆదుకోవాలి. పంటలు సమయానికి వర్షం పడకపోవడం, అప్పులు చేసి పెట్టుబడి పెట్టిన రైతులు తీవ్రంగా నష్టపోయి అప్పులు ఊబిలో కూరుకుపోతున్నారు. ప్రభుత్వం పరిహారం చెల్లించి న్యాయం చేయాలి

- దాకారపు శ్రీనివాసరావు, సిపిఎం మండల నాయకులు

సామాజిక భవనం కోసం సంతకాల సేకరణ

ప్రజాశక్తి -తగరపువలస : జివిఎంసి రెండో వార్డు పరిధి సంతపేట రెడ్డివీధిలో సామాజిక భవనం మంజూరు చేయాలని కోరుతూ స్థానికులు గురువారం సంతకాల సేకరణ చేపట్టారు. ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు స్పందించి సామాజిక భవనం మంజూరుకు కృషిచేయాలని కోరారు. శుభ కార్యాలు, సమావేశాలు జరుపుకునేందుకు సామాజిక భవనం లేక ఏళ్ళ గా ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి వార్డు అధ్యక్షులు ఎస్.వంశీరెడ్డి, మాజీ కౌన్సిలర్ సిహెచ్.ఎల్లయ్యరెడ్డి, వైసిపి మహిళా అధ్యక్షులు ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీ హైస్కూల్‌ను సందర్శించిన ఎంపిపి

ప్రజాశక్తి -భీమునిపట్నం : మండలంలోని దాకమర్రి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఎంపిపి దంతులూరి వెంకట శివ సూర్య నారాయణరాజు, సర్పంచ్ చెల్లూరి పైడపుడు, ఎంపిటిసి సభ్యులు నగేష్‌బాబు, వైసిపి మండల అధ్యక్షులు గాడు శ్రీను, నాయకులు పొట్నూరు చంద్ర శేఖర్‌తో కలిసి గురువారం సందర్శించారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా పలువురు గ్రంథాలయోద్యమ పితామహుల పుస్తకాలను పాఠశాలో ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్వరూపానందేంద్ర జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి - ఆరిలోవ : విశాఖ శారద పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి జన్మదిన వేడుకలు జివిఎంసి 10వ వార్డు పరిధి ఇందిరానగర్, ఆనందమార్గ ఆశ్రమంలో వైసిపి జిల్లా ప్రధానకార్యదర్శి జగుపిల్ల అప్పలరాజు ఆధ్వర్యాన గురువారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విశాఖ ఎంపీ ఎంవివి సత్యనారాయణ హాజరై ఆశ్రమంలోని అనాథ పిల్లలకు పండ్లు, వృద్ధులకు చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆచార్య సౌమ్యానంద అవధూత పాల్గొన్నారు.

జనసేన నాయకులకు షోకాజ్ నోటీసులు

ప్రజాశక్తి-అనకాపల్లి : పట్టణంలోని ఉప్పల చంద్రశేఖరరావు కళ్యాణమండపంలో బుధవారం జరిగిన జనసేన, టిడిపి ఆత్మీయ సమావేశంలో తమకు మాట్లాడటానికి అవకాశం ఇవ్వలేదని నిలదీసిన నాయకులకు ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు గురువారం షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఈ సమావేశంలో జనసేన పార్టీకి చెందిన పలువురు అనకాపల్లి నియోజకవర్గం ఇంచార్జ్ పరుచూరి భాస్కరరావుతో వాగ్వాదానికి దిగి కార్యక్రమం రసాభాస చేసిన విషయం తెలిసింది. దీనిపై పార్టీ కేంద్ర కార్యాలయం క్రమశిక్షణ చర్యలు ప్రారంభించింది. పార్టీకి సంబంధం లేని కొంతమంది గుర్తు తెలియని వ్యక్తులను కార్యక్రమంలోకి తీసుకురావడాన్ని గుర్తించిన పార్టీ అధిష్టానం ఆదేశాలు మేరకు నియోజకవర్గం జనసేన నాయకులు దూలం గోపినాథ్, మళ్ళ శ్రీనుకు జిల్లా పార్టీ అధ్యక్షులు పంచకర్ల రమేష్ బాబు గురువారం షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఇదే విషయమై రమేష్ బాబు మాట్లాడుతూ పార్టీ క్రమశిక్షణను అతిక్రమించి ప్రవర్తిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

జగన్‌కు ప్రైవేటు సైన్యంలా సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు

ప్రజాశక్తి-అనకాపల్లి : రాష్ట్రంలో కొంతమంది సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు జగన్ రెడ్డికి ప్రైవేటు సైన్యంలా పనిచేస్తున్నారని మాజీ శాసనసభ్యులు పీలా గోవింద సత్యనారాయణ ఆరోపించారు. గవరపాలెం పార్టీ కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర ప్రజలందరూ వై ఏపీ హేట్స్ జగన్ అని అంటున్నారని ఎద్దేవా చేశారు. సచివాలయాలలో జాతీయ జెండాకు బదులు వైసిపి జెండాను ఆవిష్కరించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యుత్, పెట్రోల్, డీజిల్, నిత్యవసర వస్తువుల ధరలు పెంచినందుకా జగన్ మళ్ళీ రావాలి అని ప్రశ్నించారు. జగన్ రెడ్డికి ఇచ్చిన ఒక్క అవకాశం వల్లే రాష్ట్రం 20ఏళ్ళ వెనక్కి వెళ్లిపోయిందని ఎద్దేవా చేశారు.

ప్రజాశక్తి
శుక్రవారం 17 నవంబర్ 2023

గ్రంథాలయోద్యమకారులకు ఘననివాళి



చోడవరంలో జాతీయ నేతల ఫొటోలతో విద్యార్థులు

56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. గురువారం గ్రంథాలయ పితామహులు, ఉద్యమకారులను స్మరించుకుని, ఘనంగా నివాళు లర్పించారు. విద్యార్థులకు వ్యాసరచన, డ్రాయింగ్, క్విజ్ వంటి పోటీలను నిర్వహించారు.

(ప్రజాశక్తి విలేకర్ల యంత్రాంగం)

మాడుగుల :గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా గ్రంథాలయోధ్యమకారులు ఎస్ఆర్ రంగనాథన్, పాతూరి నాగభూషణం, అయ్యంకి వెంకటరమణయ్య, గాడిచర్ల హరిసర్వోత్తమరావు, మాడపాటి హనుమంతరావు వంటి ప్రముఖుల చిత్రపటాలకు లైబ్రేరియన్ వై వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘనంగా నివళులర్పించారు. గ్రంథాలయాల అభివృద్ధికి వారు చేసిన సేవలను విద్యార్థులకు వెంకటేశ్వర్లు వివరించారు. అనంతరం విద్యార్థులకు కుర్చీపోటిలు నిర్వహించారు.

గొలుగొండ : స్థానిక శాఖ గ్రంథాలయంలో 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా గురువారం గ్రంథాలయాధికారి రాజుబాబు ఆధ్వర్యంలో విద్యార్థులకు డ్రాయింగ్పోటీలు నిర్వహించారు. సమీప పాఠశాలల నుండి 50 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శి రఘు, ఇఒపిఆర్డి రమణి పాల్గొన్నారు.

భీమునిపట్నం : జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో గురువారం విద్యార్థులకు చిత్ర లేఖనం పోటీలు నిర్వహించారు. శాఖా గ్రంథాలయాధికారి మహేష్ ఆధ్వర్యాన జరిగిన ఈ కార్యక్రమంలో జివిఎంసి హైస్కూల్ హెచ్ఎం సింహాచలం, ఉపాధ్యాయులు అశోక్, సుజాత కుమారి, విజయలక్ష్మి పాల్గొన్నారు. ర్యాలీ నిర్వహించారు.

పెందుర్తి : పెందుర్తి శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి బి.సూర్యకళ ఆధ్వర్యాన, సమరసత సేవ ఫౌండేషన్ కార్యకర్త ఎల్ఎస్ఎన్.మూర్తి పర్యవేక్షణలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ పాఠకులు, సిబ్బంది, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ వైస్ ప్రెసిడెంట్ పి.భూలోకరావు, కార్యదర్శి ఆడారి రామకృష్ణ పాల్గొన్నారు.

సింహాచలం: అడవివరం శాఖా గ్రంథాలయంలో యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలపై గ్రంథాలయాధికారి నరసింహ ఆధ్వర్యాన అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా స్టేట్ బ్యాంక్ ఇన్స్యూరెన్స్ మేనేజర్ పంతులు జగన్నాధరావు హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గురుకుల పాఠశాల లైబ్రేరియన్ కె.మాధవీలత, బిపి.రాజేంద్రప్రసాద్, సిహెచ్ సూర్యనారాయణరాజు, రామకృష్ణ పాల్గొన్నారు.

విశాఖపట్నం: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా స్ట్రీమ్ లైనింగ్ రీసెర్చ్ యూజింగ్ వెబ్ ఆఫ్ సైన్స్ అంశంపై సదస్సును నిర్వహించారు. ఏయూ ప్లాటినం జూబ్లీ సమావేశ మందిరంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో క్లారిఫైడ్ సంస్థ ప్రతినిధి జస్వంత్ వెబ్ ఆఫ్ సైన్స్ వినియోగం, ఉపయోగాలు వివరించారు.

ఆరిలోవ : బాలలు చిన్నప్పటి నుంచే

ఘనంగా వారోత్సవాలు

పాఠ్యపుస్తకాలతో పాటు ఇతర జనరల్ నాలెడ్జ్ పుస్తకాలు చదవడం అలవరుచుకోవాలని బాలవికాస్ ఫౌండేషన్ వ్యవస్థాపక కార్యదర్శి నరవ ప్రకాశరావు సూచించారు. గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకొని తోటగరువు ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు వి.విశ్వనాధం అధ్యక్షతన సమావేశం నిర్వహించారు.

ఆనందపురం : గ్రంథాలయాలు విజ్ఞాన గనులు అని డిఇఒ చంద్రకళ అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఆనందపురం శాఖా గ్రంథాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆమె పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా హైస్కూల్ విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు చందక సూరిబాబు, సబ్పోస్టుమాస్టర్ హరికృష్ణ, గ్రంథాలయాధికారి బివిఎస్ అప్పారావు పాల్గొన్నారు.

నక్కపల్లి: మండలంలోని పెదబోదుగల్లం హైస్కూల్ గ్రంథాలయంలో వారోత్సవాల్లో భాగంగా గురువారం చిన్నారులు ప్రదర్శించిన ఝాన్సీ లక్ష్మీభాయి ఏకపాత్రాభినయం పోటీలు పలువురిని అలరించాయి. హెచ్ఎం సత్యనారాయణ మాట్లాడుతూ, ఇటువంటి పోటీల ద్వారా చిన్నారులలో దాగి ఉన్న సృజనాత్మకతను బయటకు వెలికితీసి, ప్రోత్సహించడానికి దోహదపడతా యన్నారు. అనంతరం కథల పోటీలు, నిర్వహించి



నక్కపల్లిలో ఏకపాత్రాభినయం ప్రదర్శన పోటీలు

విజేతలను ఎంపిక చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎన్విఎస్.ఆచార్యులు, ఫల్గుణరావు, ఎవిఎల్ఎన్.కుమారి, రమేష్బాబు, చిన్నారావు, శ్రీదేవి పాల్గొన్నారు.చినదొడ్డుగల్లు గ్రంథాలయంలో లైబ్రేరియన్ జనార్ధన్ ఆధ్వర్యంలో గ్రంథాలయ ఉద్యమకారులకు నివాళులర్పించారు.

ములగాడ : స్థానిక ప్రకాష్నగర్లోని శాఖా గ్రంథాలయంలో చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. రాష్ట్ర గ్రంథాలయ ప్రతినిధి మహేష్ బాబు గురువారం గ్రంథాలయాన్ని సందర్శించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గ్రంథాలయ సంస్థ అసిస్టెంట్ డైరెక్టర్ రవికుమార్, జిల్లా గ్రంథాలయ సంస్థ సెక్రటరీ ఆర్సిహెచ్.వెంకటరావు, ఎన్ఎస్ఎస్ జిల్లా ప్రోగ్రాం అధికారి ఇపిఎస్.భాగ్యలక్ష్మి, గ్రంథాలయాధికారి వి.అజయ్కుమార్ పాల్గొన్నారు.

స్థానిక సెయింట్ ఆన్స్ కళాశాల గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వారోత్సవాల్లో పుస్తక పఠనం అవశ్యకతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల యాజమాన్య ప్రతినిధి సిస్టర్ జానీస్, అధ్యాపకులు ఇపిఎస్.భాగ్యలక్ష్మి, లక్ష్మీదేవి, వై.అనసూయదేవి, సలోమి, ప్రేమలత, గ్రంథాలయాధికారి జి.శిరీష పాల్గొన్నారు.

కశింకోట : మండలంలోని తాళ్ళపాలెం గ్రంథాలయంలో విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. అనంతరం గ్రంథాలయం అవశ్యకత తెలియజేస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు కాయలు మురళి, గ్రంథాలయం అధికారి కాండ్రేగులు జగన్, విద్యార్థులు పాల్గొన్నారు. కశింకోట గ్రంథాలయంలో విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు శాస్త్రి, ఉపాధ్యాయులు అప్పారావు, గ్రంథాలయం



కోటవురట్లలో విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు

అధికారి వరలక్ష్మి నిర్వహించారు.

కోటవురట్ల: స్థానికశాఖా గ్రంథాలయంలో వారోత్సవాల్లో భాగంగా గురువారం గ్రంథాలయ అధికారి అప్పలనాయుడు ఆధ్వర్యంలో గ్రంథాలయోధ్యమకారులకు నివాళులర్పించారు. విద్యార్థులకు క్విజ్ పోటీలు, పుస్తక ప్రదర్శన నిర్వహించారు

మునగపాక రూరల్ : స్థానిక శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయ ఉద్యమ నేతలు పద్మశ్రీ అయ్యంకి వెంకటరమణయ్య, గాడిచర్ల హరిసర్వోత్తమరావు, డాక్టర్ ఎస్ఆర్ రంగనాథన్ చిత్రపటాలకు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత శివ కోటి దుర్గాప్రసాద్, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు పెంటకోట తులసిరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు శివకోటి దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో జూనియర్, సీనియర్ విభాగాలలో చిత్రలేఖనం పోటీ నిర్వహించారు. ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, ఆశా దేవి, సీనియర్ పాఠకులు ఆడారి సూర్యనారాయణ, వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

కె.కోటపాడు : మండలంలోని చౌడువాడ శాఖ గ్రంథాలయంలో విద్యార్థులకు గ్రంథాలయాల ప్రాముఖ్యతపై గ్రంథాలయ అధికారి ఎం.పద్మావతి ఆధ్వర్యాన వ్యాసరచన పోటీలు నిర్వహించారు. జెడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సబ్బవరం : స్థానిక శాఖా గ్రంథలయంలో విద్యార్థులకు పాటల పోటీలు నిర్వహించారు. ముందుగా గ్రంథాలయ ఉద్యమకారులు అయ్యంకి వెంకట రమణయ్య, గాడిచర్ల హరిసర్వోత్తమరావు, పాతూరి నాగభూషణంకు నివాళు లర్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి వి.శిరీష, ఉపాధ్యాయులు సాయి కుమార్, వి.పద్మావతి, ఎ.జయలక్ష్మి, బి. రామకృష్ణ పాల్గొన్నారు.

బుచ్చయ్యపేట : స్థానిక శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకువ్యాసరచన, పద్యాల పోటీలు నిర్వహించారు. గ్రంథాలయ ఉద్యమకారులు గాడిచర్ల హరి సర్వోత్తమ రావు, అయ్యంకి వెంకట రమణయ్య చిత్రపటాలకు పూలమాలలు వేశారు. కార్యక్రమంలో జాజి మొగ్గలు ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ఉపాధ్యాయులు విద్యార్థులు, లైబ్రేరియన్ ఆర్ కృష్ణారావు పాల్గొన్నారు.

చోడవరం : స్థానిక శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయం ఉద్యమకారులు డాక్టర్ ఎస్ఆర్ రంగనాథ్, పాతురి నాగభూషణం, అయ్యంకి వెంకటరమణయ్య, గాడిచర్ల సర్వోత్తమరావు చిత్రపటాలకు పూలమాలలు వేశారు. గ్రంథాలయాల అభివృద్ధికి చేసిన కృషి సర్మించు కున్నారు. విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన పోటీలు నిర్వహించారు.

చోడవరం : గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న కార్యక్రమాలను ఎంఇఒలు జయలక్ష్మి, సింహాచలం, సిఆర్పి కెవిఎమ్.నాయుడు గురువారం సందర్శించారు. పాఠశాల తెలుగు భాష ఉపాధ్యాయులు సొంత నిధులతో పాఠశాలకు బహుకరించిన తెలుగు బాషా మూర్తుల చిత్రపటాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం రామిరెడ్డి ,కమిటీ ఛైర్మన్ కుమారి, తెలుగుభాష ఉపాధ్యాయులు గోవింద, అనురాధ, రాధ, మణిమాల పాల్గొన్నారు.

ఫైలేరియా నిర్ధారణకు రక్త నమూనాల సేకరణ

ప్రజాశక్తి -ఎస్ రాయవరం : జిల్లా ఫైలేరియా కేసులు ఎక్కువగా ఉన్న గ్రామాల్లో ఒకటైన కొరుప్రోలులో వ్యాధి నిర్ధారణకు నివారణకు రక్త నమూనాల సేకరణ చేపట్టినట్లు జిల్లా మలేరియా హెల్త్ ఇన్స్పెక్టర్ పి శంకరరావు తెలిపారు. గురువారం రాత్రి గ్రామంలోని వివిధ ప్రాంతాలలో ఇరవై సంవత్సరాలు పైబడిన వారి నుండి రక్తం సేకరించారు. కేంద్ర ప్రభుత్వ డైరెక్టర్ ఆఫ్ హెల్త్ నుండి వచ్చిన ఆదేశాల మేరకు డిఎంహెచ్ఒ సూచనలతో గ్రామంలో ఐదు వందల మంది నుంచి రక్త నమూనాలు సేకరించి, విశ్లేషణ చేస్తామన్నారు. వీరిలో ఎవరికైనా పాజిటివ్ వస్తే వారికి చికిత్స అందిస్తామన్నారు. జిల్లా మలేరియా సిబ్బంది, పెనుగొల్లు పిహెచ్సి హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనువాస్, హెల్త్ సూపర్వైజర్ ఆదినారాయణ, హెల్త్ అసిస్టెంట్లు దేవరాజ్, సత్తిబాబు, సాజిత్, ఎఎన్ఎం లక్ష్మి, వివిధ గ్రామాల సచివాలయ ఎఎన్ఎంలు, ఆశాలు, వాలంటీర్లు పాల్గొన్నారు



రక్త నమూనాలను సేకరిస్తున్న వైద్యసిబ్బంది

దగాకోరు జగన్కు బుద్ధి చెప్పండి

మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్ : రాష్ట్ర ప్రజలను ముఖ్యమంత్రి జగన్మోహన్రెడ్డి మోసం చేస్తున్నారని మాజీమంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు ఆరోపించారు. గురువారం మీడియాకు విడుదల చేసిన వీడియాలో నాడు నేడు పథకం కోసం రూ.1600వేల కోట్లు ఖర్చు చేస్తున్నామని ఎంతో ఆర్భాటంగా చెబుతున్నారని, కానీ ఖర్చు చేసింది కేవలం రూ.783కోట్లు మాత్రమే అన్నారు. ఎన్నికల ముందు ఇంట్లో ఎంత మంది పిల్లలు ఉంటే అందరికీ అమ్మఒడికి కింద రూ. 15వేలు చొప్పున ఇస్తామని చెప్పి, తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్కరికి ఇస్తున్నారని, అందులో రూ.2వేలుకట్ చేసి 13వేలు మాత్రమే ఇస్తున్నారన్నారు. ప్రజలను మోసం చేస్తూ పాలన సాగిస్తున్న దగాకోరు జగన్కు రాబోయే ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని కోరారు.

చెట్టుపల్లి, బైలపూడిలో పశు విజ్ఞానబడి



పశు ఆరోగ్య సంరక్షణ కార్డులు పంపిణీ చేస్తున్న వైద్యులు

ప్రజాశక్తి- చీడికాడ : మండలంలోని బైలపూడి, చెట్టుపల్లి గ్రామాలలో చీడికాడ, పెదగోగాడ పశు వైద్యాధికారులు డాక్టర్ గాయత్రి దేవి, డాక్టర్ కెవిఎస్ రాఘవమ్మ అధ్వరంలో గురువారం పశు విజ్ఞాన బడి, పశు వైద్యశిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో 60 మంది పాడి రైతులకు చెందిన 28 గర్భకోశ వ్యాధులకు, 40 పశువులకు సాదారణ చికిత్స చేశారు 35 మంది పాడి రైతులకు పశు ఆరోగ్య సంరక్షణ కార్డులు పంపిణీ చేశారు. మాడుగుల పశువైద్య సహాయ సంచాలకులు డాక్టర్ వి. చిట్టినాయుడు, చెట్టుపల్లి సర్పంచ్ గొర్లి గణేష్, పశు వైద్య సహాయకులు సాయి, గంగునాయుడు, 1962 సిబ్బంది, లాబ్ టెక్నీషియన్ కుమారి పాల్గొన్నారు

అగ్నిప్రమాద బాధితులకు ఆర్ధికసాయం



ఆర్థికసాయం అందజేస్తున్న శానాపతి కుటుంబ సభ్యులు

ప్రజాశక్తి -ఎస్ రాయవరం: మండలంలో ధర్మవరం-అగ్రహరం గ్రామంలో జరిగిన అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన జోగ రమణ, మంగ కుటుంబానికి గురువారం శానాపతి బాబూరావు మాస్టారు, వారి సోదరులు కలసి రూ.ఐదువేలుఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో నగిరెడ్డి వెంకటరమణ (చంటి), శానాపతి రంగబాబు, శానాపతి రాజు, శానాపతి దొరబాబు, శానాపతి రామకుమార్,శానాపతి వెంకటేష్ పాల్గొన్నారు.

దుర్భిక్ష పరిస్థితిపై నివేదిక

ప్రజాశక్తి -భీమునిపట్నం : ప్రస్తుతం భీమిలి, ఆనందపురం, పద్మనాభం మండలాల పరిధిలో నెలకొన్న దుర్భిక్ష పరిస్థితిని వ్యవసాయ శాఖ రాష్ట్ర కమిషనర్, జిల్లా కలెక్టర్ వృష్టికి తీసుకెళ్లినట్లు వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బి.విజయప్రసాద్ గురువారం తెలిపారు. డివిజన్ పరిధిలో ఏమేరకు వరి పంటకు నష్టం వాటిల్లింది.. ఎంత మంది రైతులకు నష్టం జరిగిందనే వివరాలను క్రోడీకరించి నివేదిక రూపంలో అందజేసినట్లు వివరించారు. ఇవే వివరాలను స్థానిక ఎమ్మెల్యే ముత్తంశెట్టి దృష్టికి కూడా తీసుకెళ్లామన్నారు. రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకుంటుందని స్పష్టం చేశారు.

50 శాతం రాయితీపై చోడి, పెసర, మినుం విత్తనాలు

ప్రస్తుతం వరి పంట నష్ట పోయిన రైతులతో పాటు మిగిలిన రైతులకు కూడా 50 శాతం రాయితీపై చోడి, పెసర, మినుము విత్తనాలు అందజేస్తున్నట్లు ఆయన తెలిపారు.

ఆసుపత్రి అప్‌గ్రేడేషన్ కల సాకారం

ఎమ్మెల్యే గొల్ల బాబూరావు



ఆసుపత్రి అదనపు భవనాలను ప్రారంభిస్తున్న ఎంపీ సత్యవతి, పక్కనే ఎమ్మెల్యే బాబూరావు

ప్రజాశక్తి,-నక్కపల్లి : ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి సహకారంతో నక్కపల్లి 30 పడకల ఆసుపత్రిని 50 పడకల స్థాయికి పెంచడంతో తన నెరవేరిందని ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. రూ.3 కోట్ల నిధులతో నిర్మించిన ఆసుపత్రి భవన నిర్మాణ సముదాయాలను గురువారం అనకాపల్లి ఎంపీడాక్టర్ బీవీ సత్యవతితో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు.

ఈ సందర్భంగామాట్లాడుతూ తాను ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత మొదటిసారిగా వచ్చినప్పుడు ఆసుపత్రిలో ఇద్దరు డాక్టర్లు కూడా లేరన్నారు..ఆసుపత్రిని అన్ని విధాలా అభివృద్ధి చేయాలని అపుడే సంకల్పించి, సిఎం జగన్ దృష్టికి తీసకెళ్లానన్నారు. ముఖ్యమంత్రి సహకారంతో అది నేడు సాకారమైందన్నారు. నక్కపల్లి ఆసుపత్రిలో ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటు, వంద పడకల స్థాయికి అప్‌గ్రేడ్ చేయడం తన తదుపరి లక్ష్యమన్నారు.

ఎంపీ సత్యవతి మాట్లాడుతూ అంకితభావం, సేవాగుణంతో వైద్యులు సిబ్బంది రోగులకు సేవలు అందించాలన్నారు. గైనిక్‌లు రేడియాలజిస్ట్ శిక్షణ తీసుకొని సేవలను మరింత విస్తరించాలన్నారు. అనకాపల్లి, నక్కపల్లిలో ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటుకు కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖకు లేఖ రాశామన్నారు. అనకాపల్లిలో రూ.23 కోట్ల 50 లక్షలతో క్రిటికల్ కేర్ సెంటర్‌ను రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంజూరు చేసిందని, ముున్ముందు నక్కపల్లి ఆసుపత్రిలో కూడా ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. కాగా ఆసుపత్రి అభివృద్ధికి రూ.కోటి సిఎస్‌ఆర్ నిధులు కేటాయించిన హెటిరో యాజమాన్యాన్ని ఎంపీ సత్యవతి, ఎమ్మెల్యే బాబూరావు ప్రశంసించారు. మొదటి విడతలో 40 లక్షల రూపాయల వ్యయంతో అల్ట్రా సౌండ్ స్కానర్, ఎనస్థీషియా, వర్క్ స్టేషన్, బయో మెడికల్ రూమ్, ఆర్.ఓ ప్లాంట్‌లను సమకూర్చారన్నారు. కార్యక్రమంలో హెటిరో సిఎస్‌ఆర్ జిఎం సుధాకర్ మాట్లాడుతూ కంపెనీ చైర్మన్ పార్థసారథిరెడ్డి సూచనలు మేరకు ఆసుపత్రికి నాణ్యమైన వైద్యపరికరాలను అందిస్తామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ, ఎపిపిఎస్‌సి డైరెక్టర్ సోను వుడ్, డిసిహెచ్ శ్రీనివాసరావు, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్‌ఈశ్వర ప్రసాద్, ఎంపీపీ రత్నం, వైస్ ఎంపిపి నానాజీ, వైసిపిమండల శాఖ అధ్యక్షులు శీరం నరసింహమూర్తి, కంపెనీ ప్రతినిధులు ఎం.ప్రభాకర్, యన్ సుధాకర్, ఎస్. కుల్లాయిరెడ్డి, ఎం.సుబ్బారెడ్డి, ఎస్.రాజారెడ్డి ,ఎంఎన్‌విఎస్. రెడ్డి పాల్గొన్నారు.

పలు భవనాల ప్రారంభోత్సవాలు

కోటవురట్ల : మండలంలో పలు ప్రభుత్వ ప్రాధాన్యతా భవనాలను గురువారం స్థానిక ఎమ్మెల్యే గొల్ల బాబూరావు, ఎంపీ డాక్టర్ బీవీ.సత్యవతి ప్రారంభించారు. 50పడకల స్థాయికి అప్‌గ్రేడ్ చేసిన స్థానిక సిహెచ్‌సి భవనాలను, మండల కేంద్రంలో రెండు సచివాలయాలు, పొందూరు తంగేడు గ్రామాలలో బస్‌షెల్టర్లు, తంగేడు గ్రామంలో రైతుభరోసాకేంద్రం, వెల్‌నెస్ సెంటర్లను, ఎండపల్లిలో గ్రామ సచివాలయం, రైతుభరోసా కేంద్రాలను ప్రారంభించారు, మాజీ ఎమ్మెల్సీ డివి సూర్యనారాయణ రాజు, వైసిపి మండల అధ్యక్షులు కిల్లాడ శ్రీనివాసరావు, వైస్ ఎంపిపిదత్తుడు రాజు, స్థానిక సర్పంచ్ అనిల్‌కుమార్, పందూరు చీకట్ల జగదీష్, తంగేడు కొరుపోలు శివ, ఎండపల్లి సర్పంచ్ పావని పాల్గొన్నారు.

బాక్సింగ్‌లో నింజాస్ క్రీడాకారుల సత్తా



పతకాలు సాధించిన క్రీడాకారులు

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్ : ఎపి బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విశాఖ సాయిసెంటర్ వద్ద ఈ నెల 13 నుంచి 15వ తేదీ వరకు నిర్వహించిన 7వ సీనియర్ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలలో నర్సీపట్నం నింజాస్ అకాడమీ క్రీడాకారులు నాలుగు పతకాలు సాధించారు. 66 కేజీల విభాగంలో కొలుకుల కృష్ణవేణి, 81కేజీల విభాగంలో బొంతు మౌనిక గోల్డ్ మెడల్స్ సాధించారు. అలాగే 70కేజీల విభాగంలో కె..అరుణ రజక పతకం, 70 కేజీల విభాగంలో వి.ప్రియాంక కాంస్య పతకం సాదించారు. పతకాలను సాధించిన క్రీడాకారులను ఆకాడమీ డైరెక్టర్లు అభినందించారు. విజేతలకు సెక్రటరీ లక్ష్మణదేవ్, ద్రోణాచార్య అవార్డు గ్రహీత ఐ.వెంకటేశ్వరరావు బహుమతులు అందజేశారు.

జెడ్‌పి సిఇఒకు అభినందన



సిఇఒ పోలినాయుడును అభినందిస్తున్న సంజీవరావు

ప్రజాశక్తి-మాడుగుల: ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్ సిఇఒ ఎం.పోలినాయడును కాపు సంఘం డైరెక్టర్, ఎం కోడూరు సర్పంచ్ గొల్లవిల్లి సంజీవరావు గొల్లవిల్లి సంజీవరావు. గురువారం మర్యాదపూర్వకంగా కార్యాలయంలో కలిసి పుష్పగుచ్చాన్ని అందించి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ సిఇఒ పోలినాయుడు మరెన్నో ఉన్నత పదవులను అందుకోవాలని ఆకాంక్షించారు. ఎ కాంట్రాక్టర్ ఎస్‌కె భాష,రాఖీ శ్రీను ఉన్నారు.

పశువ్యాధులపై అప్రమత్తత అవసరం



సూచనలు చేస్తున్న పశువైద్యాధికారి

ప్రజాశక్తి-రోలుగుంట: పశువులకు సోకే వ్యాధుల పట్ల పాడిరైతులు అప్రమత్తంగా ఉండాలని రోలుగుంట పశువైద్యాధికారి డాక్టర్ నూకేశ్వరరావు సూచించారు. గురువారం కొంతలం గ్రామంలో పర్యటించి దూడలకు వ్యాపిస్తున్న ముద్ద చర్మవ్యాధికి సూచనలు చేశారు. ఈ వ్యాధి సోకకుండా పశువులకు 10 తమలపాకులు, 10 మిరియాలు, ఉప్పు కలిపిన చూర్ణాన్ని రోజుకు రెండుసార్లు తినిపించాలన్నారు నాలుగు నెలలు దాటిన ఆవు దూడలకు వ్యాధి నివారణ టీకాలు వేయించాలన్నారు
బలహీనత, ఆకలి లేకపోవడం, చర్మంపై చిన్న బొబ్బలు వంటి ముద్ద చర్మవ్యాధికి సంబంధించిన ప్రాథమిక లక్షణాలు పశువుల్లో కనిపించిన వెంటనే సమీప సచివాలయ పశువైద్య సహాయకులను సంప్రదించాలన్నారు. వ్యాధిసోకిన పశువులకు మొక్కజొన్న పిండి, బెల్లంతో కూడిన ద్రావకాన్ని తరచూ త్రాగించాలన్నారు. రెండు, మూడు గంటలకు ఒకసారి తమల పాకులు, మిరియాలతో కూడిన చూర్ణాన్ని అప్పటికప్పుడు తయారుచేసి నాలుక ద్వారా శరీరం లోపలకు అందించాలన్నారు. చర్మంపై బొబ్బులు పెద్దగా ఉన్నట్లయినా పసుపు, వేప నూనె కర్పూరం, బోరిక్ పౌడర్‌తో కూడిన లేపనాన్ని పూయాలన్నారు. ఈ వ్యాధి సంక్రమణకు కారణమైన జోరీగల నియంత్రణకు పరిసరాలు పరిశుభ్రంగా ఉండేటట్లు చూడాలన్నారు.

రాష్ట్ర శ్రేయస్సే టిడిపి, జనసేన కూటమి లక్ష్యం

ఆత్మీయ సమావేశంలో మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు



మాట్లాడుతున్న మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్ : రాష్ట్ర శ్రేయస్సు కోసమే టిడిపి, జనసేన పార్టీల కూటమి ఏర్పడిందని మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. గురువారం సాయంత్రం అయ్యన్న నివాసంలో వద్ద నర్సీపట్నం నియోజకవర్గ తెలుగుదేశం, జనసేన పార్టీల ఆత్మీయ కలయిక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ తాను ఎప్పటి నుంచే ఈ రెండు పార్టీలు కలిసిపని చేయాలని కోరుకున్నానన్నారు. అధికారం, పదవులు శాశ్వతం కాదని, రాష్ట్ర ప్రజల శ్రేయస్సు ముఖ్యమన్నారు. ఈ రెండు పార్టీల అధినేతలైన చంద్రబాబు, పవన్ కల్యాణ్ నిర్ణయాన్ని అందరూ స్వాగతిస్తున్నామన్నారు. సైకో పాలనకు తరలికొట్టేందుకు టిడిపి, జనసేన నాయకులు ఉమ్మడిగా పని చేయాలని పిలుపునిచ్చారు. జనసేన పార్టీ ఉమ్మడి విశాఖ జిల్లా అధ్యక్షులు పంచకర్ల రమేష్ బాబు మాట్లాడుతూ టిడిపి, జనసేన కూటమితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని, ఇరుపార్టీల నాయకులు సమన్వయంగా పని చేయాలన్నారు. టిడిపి అనకాపల్లి జిల్లా అధ్యక్షులు బుద్దా నాగజగదీశ్వరరావు మాట్లాడుతూ టిడిపి, జనసేనల కలయికతో వైసిపి భూస్థాపితం కావడం ఖాయమన్నారు కార్యక్రమంలో జనసేన పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ ఇన్‌చార్జ్ రాజాన వీర సూర్యచంద్ర పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి వ్యాసరచన పోటీల్లో మాడుగుల విద్యార్థినికి స్వర్ణం



పాము హేమలత

ప్రజాశక్తి-మాడుగుల: సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి వ్యాసరచన పోటీలలో మాడుగుల మండలం గాదిరాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 10వ తరగతి విద్యార్థినిపాము హేమలత ప్రథమస్థానంలో నిలిచింది. విజేతకు ఈ నెల 21న పుట్టపర్తి సత్యసాయి ప్రశాంత నిలయంలో బంగారు పతకాన్ని బహూకరించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 'ఆచార్యదేవోభవ' ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యాసరచన పోటీలలో 270 మంది విద్యార్థులు పాల్గొన్నారు రాష్ట్రస్థాయి పోటీలో ప్రథమ బహుమతితో బంగారు పతకాన్ని సాధించిన పాము హేమలతను పలువురు ప్రశంసించారు. సత్యసాయి సంస్థ మాడుగుల మండల ఇన్‌ఛార్జి పుట్టా బలరాం, కన్వీనర్ కె శ్రీనివాసరావు, సేవాదళ్ కోఆర్డినేటర్ కె రాజుకొండ(ఆర్‌కె), పి శివరామకృష్ణ, మహిళా విభాగం ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు : ధర్మశ్రీ



ప్రజల సమస్యలను వింటున్న ఎమ్మెల్యే ధర్మశ్రీ

ప్రజాశక్తి - రావికమతం :ప్రజాసమస్యల పరిష్కారానికి స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమానికి గురువారం అపూర్వ ఆదరణ లభించింది. వివిధ గ్రామాల ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. గ్రామాల నుంచి వచ్చిన ప్రజలను ఒక్కొక్కరినీ తన చాంబర్‌కు పిలిచి, సమస్యలను అడిగి తెలుసుకుని, అక్కడే ఉన్న సంబంధిత అధికారుల ద్వారావాటి పరిష్కారానికి చర్యలు చేపట్టారు.
ఈ సందర్భంగా ధర్మశ్రీ మాట్లాడుతూ, సమస్యల పరిష్కార వేదికకు మంచి స్పందన వచ్చినందున ఇక నుంచి ప్రతి మంగళవారం రోలుగుంట, బుధవారం బుచ్చయ్యపేట, గురువారం చోడవరం, శుక్రవారం రావికమతం మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు తాను అందుబాటులో ఉండి, ప్రజల సమస్యలను తెలుసుకుని, వాటి పరిష్కారానికి చర్యలు చేపడతానన్నారు..పల్లె నిద్ర కార్యక్రమం వలన మధ్యాహ్నం రెండు గంటల వరకే అందుబాటులో ఉంటానన్నారు. నియోజవర్గ ప్రజలు సద్వినియోగ పరచుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిపి పైలా రాజు ముక్కా మహాలక్ష్మి నాయుడు, గుమ్ముడి సత్యదేవ్, కంచిపాటి జగన్నాథరావు పాల్గొన్నారు.

ఉజ్వల వంటగ్యాస్ కనెక్షన్ల పంపిణీ

రావికమతం : ప్రధానమంత్రి ఉజ్వల పథకంలో మంజూరైన వంటగ్యాస్ కనెక్షన్లను ప్రభుత్వ విప్, చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ గురువారం పంపిణీ చేశారు. స్థానిక సాయి చరిష్మా హెచ్‌పి గ్యాస్ డీలర్ ద్వారా మంజూరైన 200 గ్యాస్ కనెక్షన్‌లను మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పంపిణీ చేశారు. వంటగ్యాస్ కనెక్షన్లను మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు కార్యక్రమంలో ఎంపిపి పైలా రాజు, ముక్కా మహాలక్ష్మి నాయుడు, కంచిపాటి జగన్నాథరావు పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఐసిడిఎస్ సూపర్‌వైజర్

ప్రజాశక్తి -నక్కపల్లి : బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ లలిత అన్నారు గురువారం.స్థానిక కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయంలో విద్యార్థినులకు బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. అమ్మాయిలకు 18ఏళ్లు, అబ్బాయిలకు 21ఏళ్లు ండిన తర్వాత మాత్రమే వివాహాలు చేయాలన్నారు. ఎక్కడైనా బాల్య వివాహాలు చేస్తే సమాచారం ఇవ్వాలన్నారు. బాల్య వివాహాలు చేసినా, చేయించినా, ప్రోత్సాహించినా చట్టపరంగా ఎవరైనా నేరస్తులౌతారని గ్రహించాలన్నారు. కార్యక్రమంలో లోవరాజు, అంగన్వాడీ టీచర్లు దుర్గారాణి ,జయలక్ష్మి, లక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు